ప్రజాశక్తి

సోమవారం 14 అక్టోబర్ 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా - కంట్రోల్ రూం ఏర్పాటు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దక్షిణ కోస్తా ప్రాంతంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టింది. తీర ప్రాంత మండలాల పై ప్రత్యేక దష్టి పెట్టి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి, వివిధ శాఖలు సమన్వయంతో పని చేయటానికి కలెక్టర్ కార్యాలయంలో 1077 టోల్ ఫ్రీ నెంబరుతో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య, రోడ్లు భవనాలు, విద్యుత్, వైద్య శాఖ అధికారులతో కూడిన ప్రత్యేక బందాలు ఈ కంట్రోల్ రూములో నిరంతరం విధులు నిర్వహిస్తారు. కలెక్టర్ ఆదేశాలతో ఒంగోలు ఆర్‌డిఒ కె.లక్ష్మి ప్రసన్న, జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు ఆదివారం కొత్తపట్నం మండలంలో పర్యటించారు. మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి క్షేత్రస్థాయి పరిస్థితిపై ఆరా తీశారు. తుపాన్ షెల్టర్ కేంద్రాల నిర్వహణ, లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, మహిళలు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, వద్ధులపై ప్రత్యేక దష్టి, అవసరమైన మందులను అందుబాటులో పెట్టుకోవడం, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలపై మండల స్థాయి అధికారులతో సమీక్షించారు.

కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

మద్యం దుకాణాల చుట్టూ రాజకీయం

- ముందే సిండికేట్‌గా మారిన వ్యాపారులు
- తెరచాటున వ్యవహారాలు నడిపిన ఎమ్మెల్యేలు
- నేడు లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయింపు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

మద్యం దుకాణాల కోసం వ్యాపారులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. లాటరీ పద్ధతిలో ఎవరిని అదృష్టం వరిస్తుందోనన్న ఉత్కంఠ దరఖాస్తుదారుల్లో ఉంది. కొత్త మద్యంపాలసీతో వ్యాపారం ప్రైవేటుకు అప్పగిస్తున్న సంగతి తెలిసిందే. దుకాణాలం కోసం దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ ముగిసింది.171 దుకాణాల కోసం జిల్లా వ్యాప్తంగా 3,466 దరఖాస్తులు అందాయి. ఇవన్నీ ఏకపక్షం గానే వచ్చినట్లు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన పాలసీతో దరఖాస్తుల ఫీజుతోనే కోట్లాది రూపాయలు రాబట్టుకుంది. కేవలం ఆదాయం కోసమే మద్యం వ్యాపారం సాగుతోందన్న చర్చ లేకపోలేదు. ఇకపాలక పక్షం అండదండలున్న వ్యాపారులే దుకాణాల కోసం దరఖాస్తు వేశారు. వైసిపి నుంచి నామమాత్రంగానే దరఖాస్తులు వచ్చాయి. అధికారపక్షం సహకరించదనే భయంతో ముందుకు రాలేదంటున్నారు. ఇక దుకాణాల కోసం పెద్దఎత్తున రాజకీయమే నడిచింది. ముందే వ్యాపారులు సిండికేట్‌గా మారారు. దరఖాస్తులప్రక్రియలోనే పాలకపక్ష ఎమ్మెల్యేలు చక్రం తిప్పారు. ఎవరు ఎవరు దరఖాస్తులు వేస్తున్నారనే దానిపై నిఘా పెట్టారు. ఈ రంగంలో ఉన్నవారితో సంప్రదింపులు చేశారు. ఎమ్మెల్యేలకు తెలియకుండా ఎవరు వేసినా ఇబ్బంది పడతారనే చర్చను తెరపైకి తెచ్చారు. దీంతో వైసిపి వ్యాపారులు మనకెందుకనే భావనలోనే ఉన్నారు. అధికారం లేనందున వాళ్లంతా దూరంగానే ఉన్నారు. అక్కడక్కడా కొందరు వేసినా పాలకపక్షనేతలతో రాజీలు పడ్డాకే జరిగాయంటున్నారు. ఇక మండలాల వారీగా దుకాణాలను తేల్చారు. ఎవరికి వచ్చినా సర్కిల్‌స్థాయిలో సిండికేట్‌గా మారడం ఖాయమనే సంకేతాలు ఇచ్చారు. రానివారిని కూడా భాగస్వాములు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దుకాణాల కోసం దరఖాస్తులు వేసిన వాళ్లందరూ తెలుగుదేశం మద్దతు దారులే. అందరూ కలిసే చేసుకుంటారనే చర్చ ఉంది. అంటే ముందుగానే అందరూ సిండికేట్‌గా మారారు. తెరచాటు ఎమ్మెల్యేలు కీలకపాత్ర పోసించారు.కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకువాటాలూ ఉన్నట్లు చర్చ నడుస్తోంది. కొన్ని చోట్ల ఎమ్మెల్యే అనుచరులే వారి తపున దుకాణాల కోసం దరఖాస్తు వేశారనే చర్చ కూడా లేకపోలేదు. ఏదేమైనా ఈసారి మద్యం విధానం పూర్తిగా పాలకపక్షం నుంచి నడిపేలాగే ఉంది. గతంలో ప్రభుత్వం నడపగా ఈసారి పాలకపక్షం అండతో వ్యాపారులు లేదా పాలకపక్ష వర్గీయులే మద్యం వ్యాపారం చేయనున్నారు. ఇక లాటరీ పద్ధతిలో సోమవారం దుకాణాలు కేటాయించనున్నారు. అన్నీ దుకాణాలను ఒంగోలులోనే లాటరీ పద్ధతిలో కేటాయించనున్నారు. ఇందుకోసం ఎక్సైజ్ అధికారులు తగు ఏర్పాట్లు చేశారు. మద్యం దుకాణాల ఏర్పాటుకు మంజూరు ▶ 2లో

కూటమి ప్రభుత్వం కరుణించేనా..?

- వెలిగొండ ప్రాజెక్టు పూర్తిపై రైతుల ఆశలు
- కాలయాపన చేసిన గత ప్రభుత్వం
- నిర్వాసితులకు అందని పరిహారం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ప్రకాశం జిల్లాతో పాటు నెల్లూరు, కడప జిల్లాల్లోని 4.47 లక్షల ఎకరాలకు సాగు, 30 మండలాల్లో 15 లక్షల మందికి తాగు నీరందించడమే లక్ష్యంగా పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించారు. పనులు ప్రారంభించి రెండు దశాబ్దాలు పూర్తయ్యింది. ఇంకా నీళ్లు ఇచ్చింది లేదు. ఐదేళ్ల వైసిపి పాలనలో ప్రకటనలతో సరిపుచ్చారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు పనులు పూర్తి కాకుండానే సొరంగాలు జాతికి అంకితమంటూ సరిపుచ్చారు. ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ప్రాజెక్టు పూర్తికి హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగానే ఇటీవల బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ తమీమ్ అన్సారియా క్షేత్రస్థాయి పర్యటించారు. దీంతో పశ్చిమ ప్రకాశం జిల్లావాసుల్లో మరోమారు ఆశలు చిగురించాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులైన వెలిగొండ ప్రాజెక్టు పనులు ప్రారంభించకపోవడం పట్ల రైతుల్లో కొంత మేరకు నిరాశక్తత కనిపిస్తోంది.

సొరంగాల తవ్వకం..

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా కష్ణా నదిలోని కొల్లంవాగు నుంచి పెద్ద దోర్నాల మండలంలోని కొత్తూరు వరకు 18.8 కిలో మీటర్ల పొడువునా రెండు సొరంగాలు తవ్వుతున్నారు. అనేక ఆటంకాల మధ్య పనునలు నత్తనడకన సాగాయి. నీళ్లు నిల్వ చేసే నల్లమల సాగర్ ప్రాంతంలోని పదకొండు ముంపు గ్రామాలను ఖాళీ చేయించడం, నిర్వాసితులకు పునరావాసం కల్పించడం ప్రధాన అడ్డంకులు. వైసిపి ప్రభుత్వం ఏదో విధంగా సొరంగాలను పూర్తి చేసేయాలన్న హడావిడిలో నిబంధనలు, ప్రమాణాలను గాలికొదిలేసింది.

వెలిగొండ ప్రాజెక్టు సొరంగం

యంత్రంతో తవ్వాల్సి ఉండగా..

యంత్రంతో తవ్వాల్సిన సొరంగాలను మ్యానువల్‌గా చేపట్టారు. వాటికి సెగ్మెంట్లు అమర్చలేదు. మొదటి సొరంగం నుంచి రెండో సొరంగానికి వేసిన రంధ్రాలను పూడ్చలేదు. పెద్దారవీడు మండల పరిధిలోని గుండంచర్ల, కలనూతల, సుంకేసుల, చింతలముడిపి, నాగులవరం, మార్కాపురం మండలంలోని గొట్టిపడియ, అక్కచెరువుతండా, అర్ధవీడు మండలంలోని లక్ష్మీపురం, సాయినగర్, పొట్టి సుబ్బయ్యపల్లి, కష్ణానగర్ ముంపు గ్రామాలుగా ఉన్నాయి. వీటిలో దాదాపు పది వేల మంది నివసిస్తున్నారు. కొత్తూరు వద్ద వెలిగొండ సొరంగాల నిర్మాణం పూర్తయితే ఫీడర్ కాలువ ద్వారా నల్లమల సాగర్‌ను నింపుతారు. ఇందుకుగాను ముందుగా నిర్వాసితులను ఖాళీ చేయించాలి ఉంది. వైసిపి పాలనలో వీరికి పరిహారం ఇచ్చింది లేదు. పునరావాసం కల్పించింది లేదు. కొలువుదీరిన కూటమి ప్రభుత్వం వీటన్నింటినీ పూర్తి చేసి పశ్చిమ ప్రాంత అశాజ్యోతి ▶ 2లో

నేటి నుంచి 'పల్లె పండగ'

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

పల్లె పండగ వారోత్స వాలు గ్రామా ల్లో సోమ వారం నుంచి ఈనెల 20 వరకూ జరుగనున్నాయి. గత ఆగస్టు 23న జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయ తీల్లో ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ సభల్లో గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమా లను గుర్తించారు. అందుకు కొనసాగింపుగా పల్లెపండుగ వారోత్స వాలు నిర్వహిస్తున్నారు. వారోత్సవాల్లో గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలకు ఏడాదిలో కనీసం 100 రోజులు వేతన ఉపాధి కల్పించటం, సుస్థిర ఆస్తులు ఏర్పాటు చేసి జీవనోపాధి మెరుగుదలకు చర్యలు చేపట్టనున్నారు. ఉపాధి హామీ చట్టం ద్వారా ఉపాధి వేతనదారులకు కల్పించిన హక్కులను అమలు చేయడం, పని కోరిన 15 రోజులలో పని పొందే హక్కు, లేని పక్షంలో నిరుద్యోగ భతి, పని ప్రదేశం నివాసానికి 5 కిలో మీటర్ల దూరం కంటే ఉంటే రోజువారీ కూలీకి అదనంగా 10 శాతం వేతనం, పని ప్రదేశాల్లో ప్రథమచికిత్స, తాగునీరు, నీడ వసతి తదితర సౌకర్యాలు కల్పించడం, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన వేతన రేటు రూ.300 అమలు చేయడం. పని ప్రదేశంలో కూలి మరణించినా, పూర్తిగా అంగవైకల్యానికి గురైనా ఆ కుటుంబానికి రూ 50 వేల నష్ట పరిహారం తదితర హక్కులను అమలు చేయడం, ఉపాధి హామీ చట్టం కింద మంజూరైన పనుల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తారు. పని ▶ 2లో

కూటమి ప్రభుత్వం కరుణించేనా..?

(మొదటిపేజీ తరువాయి)

అయిన వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తుందని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. అయితే ఇంకా పనులు ప్రారంభించక పోవడంతో ఈ ప్రాంత రైతాంగం అసహనం వ్యక్తం చేస్తున్నారు. యుద్ధ ప్రాతిపదికన వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి పశ్చిమ ప్రాంత రైతాంగానికి సాగునీరు. ప్రజలకు తాగునీరు అందించాలని కోరుతున్నారు.

ప్రాజెక్టు పేరు : పూలసుబ్బయ్య వెలిగొండ జలాశయం

అంచనా వ్యయం : రూ.980 కోట్ల నుంచి రూ.8,500 కోట్లకు చేరింది

నల్లమల సాగర్ నీటి నిల్వ లక్ష్యం : 43.5 టిఎంసిలు

ప్రయోజనం : ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 4.47 లక్షల ఎకరాలకు సాగు, 30 మండలాల్లోని 15 లక్షల మందికి తాగునీరు

మొదటి సొరంగం : 18.8 కిమీ (400 మీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది)

రెండో సొరంగం : 18.8 కిమీ (7 కిలో మీటర్లు లైనింగ్ పనులు చేపట్టాలి)

ప్రాజెక్టు పనులు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలి

దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి

గత వైసిపి ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకుండానే ప్రారంభించి పశ్చిమ ప్రాంత రైతాంగానికి మోసం చేసింది. ఎన్నికల సమయంలో కూటమి నేతలు అధికారంలోకి రాగానే వెలిగొండ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. వంద రోజుల పాలన సంబరాలు చేసుకుంటున్నారే తప్ప పనులు మాత్రం ప్రారంభించలేదు. ఇచ్చిన హామీ మేరకు పనులు ప్రారంభించి ప్రాజెక్టును పూర్తి చేయాలి. పశ్చిమ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలి.

వేడుకల్లో పాల్గొన్న రాజకీయ నాయకులు

పుట్టినరోజు వేడుకల్లో బూచేపల్లి

ప్రజాశక్తి-పొదిలి

మండలం రామాపురం గ్రామంలో వైసిపి సీనియర్ నాయకులు, స్థానిక వివేకానంద విద్యాసంస్థల డైరక్టర్ కెవి రమణారెడ్డి సోదరుడి కుమారుని పుట్టిన రోజు వేడుకల్లో పలువురు నాయకులు పాల్గొన్నారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైసిపి అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, గిద్దలూరు, కంభం మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, ఉడుముల శ్రీనివాస రెడ్డి పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

వరుడిని ఆశీర్వదిస్తున్న మంత్రి స్వామి

నూతన వరుడికి మంత్రి స్వామి ఆశీర్వాదం

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలం నేతివారిపాలెం గ్రామానికి చెందిన హరికృష్ణ, రేవతి వివాహం సందర్భంగా వరుడిని మంత్రి స్వామి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ జి రామయ్య చౌదరి, గ్రామస్థులు, మండలంలోని టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ముత్తుములకు సత్కారం

ప్రజాశక్తి-కొమరోలు

ఎమ్మెల్యే ముత్తుములను సత్కరిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని టిడిపి కొమరోలు మండల అధ్యక్షుడు డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో సత్కరించారు. వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గాదేవి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ నిండుగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి భువన చెన్నకేశవులు, రాజశేఖర్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆయుధ పూజలో సిఐ హజరత్తయ్య

ప్రజాశక్తి-టంగుటూరు

విజయదశమి సందర్భంగా టంగుటూరు పోలీసు స్టేషన్‌లో సిఐ హజరత్తయ్య ఆయుధపూజ చేశారు. ఈ ఆయుధ పూజలో శింగరాయకొండ టంగుటూరు ఎస్ఐ నాగమల్లీశ్వరరావు పాల్గొన్నారు.

కొమరోలు:

కొమరోలులో విజయదశమి సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ దసరా పండుగను శక్తికి, సంకల్పానికి, విజయానికి, గుర్తుగా జరుపుకుంటామన్నారు. సాంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు.

మద్యం దుకాణాల చుట్టూ రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

అనుమతుల మంజూరు చేయడానికి అవసరమైన లాటరీ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజామొహిద్దీన్ తెలిపారు. ఉదయం 8గంటల నుంచే డ్రా తీస్తామని ఆయన వెల్లడించారు.

బాపట్ల జిల్లాలో

నేడు లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాల ఖరారు

బాపట్ల జిల్లా: మద్యం దుకాణాల కేటాయింపును లాటరీ ప్రక్రియ ద్వారా సోమవారం ఎంపిక చేయనున్నారు. బాపట్ల జిల్లాలో 117 మద్యం దుకాణాల కోసం 2,149 దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.42.96 కోట్లు ఆదాయం వచ్చింది. స్థానిక ఎమ్మెస్సార్ కళ్యాణ మండపంలో జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయిస్తారు. లాటరీ ద్వారా రెండేళ్ల కాల పరిమితితో మద్యం దుకాణాల ఏర్పాటు కోసం లైసెన్స్ దారులను ఎంపిక చేస్తారు. ఈ నెల 16 నుంచి కొత్త మద్యం దుకాణాలు అందుబాటులోకి వస్తాయి. మద్యం దుకాణం పొందాలంటే పెట్టుబడి ఎక్కువ అవసరమైన నేపథ్యంలో పాత, కొత్త మద్యం వ్యాపారులందరూ సిండికేట్ అయ్యారు. ఎక్కువ వ్యాపారం జరిగే దుకాణాల కోసం పోటీ పడ్డారు. స్థానిక వ్యాపారులతో పాటు ఈ సారి విదేశాల్లో ఉన్నవారు మద్యం వ్యాపారంపై ఆసక్తి చూపారు. జిల్లా బాపట్ల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 19 దుకాణాలకు 368 దరఖాస్తులు, వేమూరులో 12 దుకాణాలకు 199, రేపల్లెలో 12 దుకాణాలకు 140, నగరంలో 12 దుకాణాలకు 179, చీరాలలో 24 దుకాణాలకు 457,అద్దంకిలో 23 దుకాణాలకు 362 , పర్చూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 15 మద్యం దుకాణాలకు 445 దరఖాస్తులు వచ్చాయి. అధికార పార్టీ అండతో వ్యాపారులు ముందుగా సిండికేట్ అయి దరఖాస్తులు వేశారు. మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న వారందరూ సోమవారం ఉదయం 7 గంటలకు బాపట్ల ఎమ్మెస్సార్ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న లాటరీ ప్రక్రియకు హాజరు కావాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి. దేవదత్తు కోరారు.

నేటి నుంచి 'పల్లె పండగ'

(మొదటి పేజీ తరువాయి)

వల్ల ఉపయోగం, భవిష్యత్తులో పనుల నేటి నుంచి పల్లె పండుగ నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనుల్లో పండ్ల తోటలు, ఫార్మ్ పాండ్లు, గోకులాలు వంటి ఆస్తుల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. నీటి ఎద్దడి గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో చెక్ డ్యాంలు, కుంటలు నిర్మించి భవిష్యత్తులో నీటి ఎద్దడి లేకుండా చేస్తారు. అన్ని ప్రభుత్వ సంస్థల భవనాల్లో పూర్తిస్థాయి నాణ్యత ప్రమాణాలతో రూఫ్ టాప్ హార్వెస్టింగ్ కట్టడాలను నిర్మించనున్నారు. జిల్లాలో పంచాయతీశాఖ ద్వారా రూ 76.66 కోట్ల నిధులతో 670 పనులు చేపట్టనున్నారు. ఆ పనులకు అధికారికంగా అనుమతులు లభించడంతో ఆన్ లైన్ లో నమోదు చేశారు. పంచాయతీలోని సాధారణ నిధులు 15వ ఆర్థిక సంఘం నిధులు రానున్నాయి. జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద కొత్తగా 694 పనులు మంజూరు కాగా రూ 11.91 కోట్ల నిధులతో పనులు చేపడుతున్నారు.ఈ మేరకు పంచాయితీలలో చేపట్టే పనులకు అధికారికంగా ఆమోదం లభించింది. గ్రామాలలో చేపట్టే అభివద్ధి కార్యక్రమాలన్నింటిని ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంలో నిర్వహిస్తారు. గ్రామాలలో చేపట్టే అభివద్ధి కార్యక్రమాలపై సిటిజన్ ఇన్ఫర్మేషన్ బోర్డులను ఏర్పాటు చేస్తారు. గ్రామాల్లో చేపట్టే పనులన్నిటిని జియోట్యాగ్ చేయనున్నారు.

ఉద్యోగం నుంచి తొలగించొద్దా?

అయితే డబ్బులివ్వు!

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అధికారిణి తన కార్యాలయంలో పనిచేస్తున్న ఓ కాంట్రాక్ట్ ఉద్యోగిని తొలగించకుండా ఉందేందుకు లంచం డబ్బులు డిమాండ్ చేశారు. ఆ ఉద్యోగి డబ్బులు ఇవ్వకపోవడంతో సదరు ఉద్యోగిని బెదిరిస్తూ వేధింపులకు గురి చేస్తున్న ఆడియో టేపులు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ అధికారిణికి గత ప్రభుత్వంలో కొంతమంది జిల్లా స్థాయి రాజకీయ నాయకులు, అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయి. దీంతో కొన్ని సంవత్సరాలుగా ఇక్కడే పాతుకుపోయి తన కత్తికి ఎదురులేదంటూ ఎవరినీ లెక్క చేయని విధంగా విధుల్లో కొనసాగుతున్నారు. మండల స్థాయి అధికారులను సైతం లెక్కచేయకుండా పనులు, వాటికి సంబంధించిన వసూళ్లు చేస్తున్నట్లు ఆమెపై పలువురు ఆరోపణలు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఆమె జాబితాలో అనేక మంది కింది స్థాయి ఉద్యోగులు, ఉపాధి కూలీలు బాధితులుగా ఉన్నట్లు ఆశాఖ ఉద్యోగుల్లో చర్చ సాగుతోంది. ఇప్పటి ప్రభుత్వంలో కూడా ఆ అధికారిణిది అదే తంతు. ప్రస్తుత అధికార పక్ష నాయకుల మద్దతు కూడగట్టేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రజాప్రతినిధుల్లో చర్చ కొనసాగుతోంది. సదురు అధికారిణిపై సంబంధిత శాఖకు సంబంధించిన అధికారులతో కాకుండా ఉన్నత స్థాయి అధికారులతో కలెక్టర్ దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని కార్యాలయ సిబ్బంది కోరుతున్నారు.

దర్శిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి-దర్శి

దర్శి ప్రశాంత హైస్కూల్లో పదో తరగతి 2003-2004 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ హోదాల్లో ఉద్యోగాలు చేస్తున్న పలువురిని సత్కరించారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత హైస్కూల్ కరస్పాండెంట్ ఎస్ వెంకటేశ్వర్లు తోపాటు ఉపాధ్యాయులు, అప్పటి పదో తరగతి బ్యాచ్ పాల్గొన్నారు.

ఒరిజినల్ పాస్పోర్టు పోయినది

బాపట్ల జిల్లా పర్చూరు మండలం వీరన్న పాలెం గ్రామ కాపురస్తుడు మానుకొండ నరేంద్ర బాబు, S/o సుబ్బరావు అను నేను నాయొక్క R8530873 నెంబర్ గల ఒరిజినల్ పాస్పోర్టు ది:25-09-2023 న పర్చూరు లో జిరాక్స్ తీసుకొని తిరిగి వెళుతుండగా ఒరిజినల్ పాస్పోర్టు మరియు బ్యాగ్ కూడా మిస్ అయినది. ఎంత వెతికినను కనిపించలేదు. కావున ఎవరికైనా దొరికిన యెడల క్రింది మా చిరునామాకు గాని పర్చూరు పోలీసు వారికి గాని చేర్చవలసినదిగా ప్రార్ధన.

ఇట్లు

మానుకొండ నరేంద్రబాబు

వీరన్నపాలెం గ్రామం,

పర్చూరు మండలం, బాపట్ల జిల్లా

సెల్ నెం : 8639107625.

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.P.No :07/2020

Between:

గార్లపాటి ఆదినారాయణ ...... పిటిషనర్

Vs

దేసు రమాదేవి వగైరాలు ....రెస్పాండెంట్స్

To

1) R8) వేజెండ్ల సుబ్బారావు S/o రాఘవులు R/o అద్దంకి గ్రామం మరియు మండలం

2) R17 గంజి హరిప్రసాద్ S/o సుబ్బారావు R/o మారెళ్ళ గ్రామం, ముండ్లమూరు మండలం , ప్రకాశం జిల్లా

3) **R18** వలపర్ల రాంబాబు S/o రామయ్య R/o వెంపరాల గ్రామం, అద్దంకి మండలం, బాపట్ల జిల్లా.

పై తెలిపిన E.Pలో మీరు రెస్పాండెంట్స్ 8,17,18 లుగా ఉన్నారు. పిటిషనర్ శ్రీయుత కోర్టు ద్వారా పలుపర్యాయములు పైతెలుపబడిన రెస్పాండెంట్స్‌కు నోటీసుల ద్వారా తెలియపరిచి నారు. కానీ మీరు కోర్టు వారికి సమాధాన పరచనందున, శ్రీయుత కోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా తేది : 11-11-2024న ఉదయం 10.30 ని.లకు మీరు గానీ, మీ తరఫు వకీల్ ద్వారా గానీ కోర్టుకు హాజరు కావలసినది. లేనియెడల మీపై పరోక్షముగా తీర్పు చెప్పేదరని ఇందు మూలకముగా తెలియజేయడమైనది

// శ్రీ కోర్టు వారు ఉత్తర్వులతో //

వాయిదా తేది : 11-11-2024

అద్దంకి ఇట్లు

తేది : 13-11-2024 **గూడాల అంజిరెడ్డి**

పిటీషనరు తరపున న్యాయవాది

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.P. No : 10/2019

గోవిందం వేంకటేశ్వర్లు .... పిటిషనరు

Vs

తోట కోటేశ్వరరావు మరియు ఇతరులు ... రెస్పాండెంట్స్

ప్రకటన

To

R2) తోట హనుమంతరావు S/o కోటేశ్వరరావు, కశ్యాపురం, జె. పంగులూరు మండలము, బాపట్ల జిల్లా.

పిటీషనరు దాఖలు చేసిన పై ఇన్ సాల్వెన్సి పిటీషన్ లో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికి మీరు దురుద్దేశ్యపూర్వకముగా తీసుకొనక తిరిగి పంపుచున్నందువలన మీకు ఈ ప్రకటన ద్వారా కోర్టువారు నోటీసులు జారీ చేసి మీ హాజరు నిమిత్తం ఈ పిటీషన్‌ను తేది. 28-10-2024 నకు వాయిదా వేశారు. కావున మీరు ఆ తేదిన ఉదయం గం.10-30ని.లకు పైకోర్టువారి ఏదుట స్వయముగాగాని వకీలు ద్వారాగాని హాజరయి పైపిటీషన్‌లో మీ ఆక్షేపణలను తెలియజేయవలెను. లేని ఏడల పై పిటీషన్‌ను మీ పరోక్షమందు తీర్మానించదరని తెలియ జేయడమయినది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో //

వజ్రాల అంజిరెడ్డి,

మారం శ్రీనివాసరావు

తాడికొండ ప్రసాద్ బాబు

వాది తరుపు న్యాయవాదులు.

అద్దంకి

'బార్' యజమానులు సిండికేట్..!

మార్కాపురంలో రెచ్చిపోతున్న మద్యం మాఫియా

ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనూ అధిక రేట్లు

ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద రద్దీ

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలో 'బార్' యజమానులంతా సిండికేట్ అయ్యారు. ప్రభుత్వ దుకాణాల్లోని నాణ్యమైన మద్యం అంతా బార్‌లకు తరలించుకున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మాత్రం చీప్ లిక్కర్ మాత్రమే అందుబాటులో ఉంచారు. అది కూడా మందు బాబుల అవసరానికి తగినంత తగా లేదు. మద్యం కొరత, అధిక ధరలతో మందు బాబులు గగ్గోలు పెడుతున్నారు.!

మార్కాపురంలో మద్యం మాఫియా రాజ్యమేలుతోం దన్నట్లుగా ప్రస్తుత పరిస్థితి కనిపిస్తోంది. ఒకటి రెండు రోజుల్లో ఎలాగూ మద్యం వ్యాపారం అంతా ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళుతోంది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బంది ఉద్యోగాలు కూడా ఊడి పోవడం ఖాయం. దీంతో అక్కడ పనిచేస్తున్న సిబ్బంది చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధి కంగా విక్రయిస్తున్నారు. బార్లలో ఈ ధరలు మరింత రెట్టింపుగా ఉన్నాయి. బార్లకు అవసరమైన మద్యం బ్రాండ్‌లను సరఫరా చేస్తున్నారు. ఫలితంగా మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బందికి కొంత పైకం ఖర్చుల క్రింద బార్ యజమానులు ముట్టజెబుతున్నట్లు తెలిసింది.

రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఊరూరా నాలుగైదు మద్యం గొలుసు దుకాణాలు పుట్టుకొ చ్చాయి. గొలుసు దుకాణాల నిర్వాహకులంతా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మాత్రమే మద్యం కొనుగోలు చేస్తు న్నారు. ఆటోలో యథేచ్ఛగా మద్యం తరలిస్తున్నారు. గతంలో గుట్టు చప్పుడు కాకుండా ఎక్కడో ఒకచోట ఉన్న గొలుసు దుకాణాలు ప్రస్తుతం బహిరంగంగా నిర్వహిస్తు న్నారు. ఓ రకంగా చెప్పాలంటే మద్యం పట్టణాల్లో, గ్రామా ల్లో ఏరులై పారుతోందని చెప్పాలి. మద్యం ఎక్కడిబడితే అక్కడ అందుబాటులో ఉంటోంది. పరిస్థితి ఇలాగే ఉంటే రాబోవు రోజుల్లో గ్రామాల్లో, పట్టణాల్లో మందు బాబులు మరింత రెచ్చిపోయే ప్రమాదం ఉందని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గొలుసు దుకాణాలు, అధిక ధరలు బహిరంగ రహస్యమే అయినా ఎక్సైజ్ శాఖ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు లేకపోలేదు.

బార్లలో ఒనర్లు అందరూ సిండికేట్‌గా మారిన ఫలితంగా మద్యం ప్రియమైంది. బార్లలో యజమానులదే ఇష్టారాజ్యం. క్వార్టర్ బాటిల్‌పై రూ. 100 అదనంగా వసూలు చేస్తున్నారు. ఫుల్‌బాటిల్ అయితే రూ. 300 వరకు వసూలు చేస్తున్నట్లు మద్యం ప్రియులు చెబుతున్నారు. బార్ యజమానులే కొన్ని ప్రాంతాల్లో గొలుసు దకాణాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు, అధిక ధరల విషయం తెలిసినా సంబంధిత అధికారులు మాత్రం మౌనం పాటిస్తున్నారు. అధికారుల మౌనం వెనుక మతలబేంటో అర్థం కాని ప్రశ్నగా మారింది.

బ్లేడుతో కోసుకుంటున్న తన్నీరు శివ మహేష్

మద్యం మత్తులో..

బ్లేడుతో గొంతు కోసుకున్న రౌడీషీటర్

ప్రజాశక్తి-శింగరాయకొండ

మద్యం మత్తులో రౌడీ షీటర్ బ్లేడుతో గొంతు కోసుకున్న సంఘటన శనివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే శింగ రాయకొండ పంచా యతీలోని కందుకూరులోని డ్రైవర్ పేట వద్ద నివాసముంటున్న రౌడీ షీటర్ తన్నీరు శివ మహేష్ శనివారం పూటుగా మద్యం సేవించి ఇంటి వద్ద బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. అరుపులు విన్న చుట్టుపక్కల వారు గమనించి 108 వాహనానికి సమాచారం అందించారు. అంబులెన్సులో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఎస్ఐ బి.మహేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-మార్కాపురం

అనారోగ్య కారణాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మార్కాపురం పట్టణంలోని పూల సుబ్బయ్య వీధిలో ఆదివారం రాత్రి జరిగింది. తాటిచెర్ల శివప్రసాద్ (50) కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆదివారం రాత్రి నిప్పంటించుకుని మృతి చెందాడు. పట్టణ ఎస్ఐ ఎం.సైదుబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు యర్రగొండ పాలెం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఎస్సై పి.చౌడయ్య రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. చెడు అల వాట్లకు స్వస్తి చెప్పి మంచి అలవాట్లతో మెలగాలని చెప్పారు. ఎవరైనా దానికి భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. పోలీస్ శాఖ ఆదేశాలు, సూచ నలు పెడ చెవిన పెట్టి ప్రజాశాంతికి భంగం కలిగిస్తే పీడీ యాక్ట నమోదు చేస్తామన్నారు. అనుమానితుల కదలికలకు పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రత్యేక నిఘా ఉంచు తుందని తెలిపారు. జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని మద్దిరాలపాడులో అక్రమంగా తరలిస్తున్న 100 బస్తాల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మద్దిరాలపాడులోని ఓ రేషన్ షాపు నుండి శనివారం రాత్రి బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఒంగోలు తాలుకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. బస్తాలను సంబంధిత షాపుకు తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దొంగతనానికి యత్నం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని ఉప్పుగుండూరులోని మెకానిక్ షాపులో దొంగతనానికి యత్నించిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్‌టి కాలనీకి చెందిన మహేష్ గంగమ్మ హోటల్ సెంటరులో ద్విచక్రవాహనాలకు సంబంధించి మెకానిక్ షాపు నిర్వహిస్తున్నాడు. రోజులాగే పని ముగించుకొని షాపు తాళా లు వేసి ఇంటికి వెళ్లారు. ఆ తరువాత అర్ధరాత్రి తాళాలు పగ లగొట్టి షట్టర్లు తెరచి దొంగతనానికి ప్రయత్నించారు. ఆది వారం తెల్లవారు జామున స్థానికులు గమనించి మహేష్‌కు తెలపడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సముద్రంలో ఎగిసిపడుతున్న అలలు

తుపాను హెచ్చరికలతో అప్రమత్తం

ప్రజాశక్తి-శింగరాయకొండ

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమ య్యారు. ఆదివారం పాకల, ఊళ్లపాలెం, బింగినపల్లి గ్రామాలలో మత్స్యకారులను అప్రమత్తం చేశారు. సముద్ర తీరంలో అలలు ఉధృతంగా ఉన్నాయి. మత్స్యకారులు బోట్లు, వలలను జాగ్రత్త చేసుకునే పనిలో పడ్డారు. మరోపక్క ఆదివారం కావడంతో పాకల సముద్ర తీరం వద్ద జనం సందడి చేశారు.

భారీ వర్షాలకు పొంగిన వాగులు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు శని వారం మండలంలోని వివిధ వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమ య్యాయి. దీంతో ప్రజలు పలుఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలోని కొత్తకోట వాగు పొంగి పొర్లడంతో ఈ మార్గంలోని రాకపోకలు నిలిచిపోయాయి. ఎటువంటి ప్ర మాదాలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉప్పుగుండూరు మాచవరం గ్రామాల మధ్యఉన్న వాగులు పొంగి ప్రవహించాయి. నాగన్న వాగు పొంగి పొర్లడంతో బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం నీలాయపాలెంకు చెందిన గుడివాడ రాజేంద్ర కారుతో వాగులోకి దిగగా వరద తాకిడికి కొట్టుకుపోయారు. కారులో ఇరుక్కున్న రాజేంద్రను స్థానికులు గమనించి తాళ్ళ సహాయంతో ఒడ్డుకు చేర్చారు. ఈ వర్షాలతో కుంటలు, చెరువులు నిండి జళకలను సంతరించుకున్నాయి.

పొర్లి ప్రవహిస్తున్న ఉప్పుగుండూరు నాగన్నవాగు

కొత్తకోట వద్ద నిలిచిన వాహనాలు

ముందస్తు చర్యలు తీసుకోవాలి

తుపాను నేపథ్యంలో మండల స్థాయి

అధికారులతో డిపిఒ వెంకట నాయుడు

మాట్లాడుతున్న డిపిఒ గొట్టిపాటి వెంకట నాయుడు

ప్రజాశక్తి-కొత్తపట్నం

బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ద్రోణి ప్రభావంతో రానున్న రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలకు అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకోవాలని డిపిఒ గొట్టిపాటి వెంకట నాయుడు అన్నారు. ఆదివారం కొత్తపట్నం మండల ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మండల స్థాయి అధికారులతో సమావేశమయ్యారు. ఎంపీడీవో శ్రీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిపిఒ వెంకట నాయుడు మాట్లాడుతూ 5 మండలాలలో ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రభావిత ప్రాంతాలలో తానే స్వయంగా పర్యటిస్తారని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు, బాలలు, దివ్యాంగులు, జబ్బులతో బాధపడేవారి జాబితా ఆయా శాఖలకు సంబంధించిన వారినుండి సేకరించి తహశీల్దార్‌కు పంపించాలన్నారు. పూరిల్లు, మట్టి ఇల్లు, లేదా శిధిలావస్థలో ఉండే ఇళ్లను గుర్తించి అందులో నివసించే వారి వివరాలు తహసీల్దార్‌కు రిపోర్ట్ ఇవ్వాలని, భారీ వర్షాలు పడితే లోతట్టు ప్రాంతాలలో నివసించేవారిని తక్షణం షెల్టర్ హౌస్‌ల్లోకి తరలించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించడానికి అవసరమయ్యే టార్చ్ లైట్, మైనపు ఒత్తులు, తాగునీరు, చిన్న పిల్లలకు అవసరమయ్యే పాలు, నిత్యావసరాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేకంగా తాగునీరు, పారిశుధ్యం, గ్రామీణ రహదారులు, కల్వర్టులు వంటి విషయాల్లో అతి జాగ్రత్తతో ఉండాలి. ఈ కార్యక్రమంలో డిపిఒ గొట్టిపాటి వెంకట నాయుడు, ఆర్డీవో కె.లక్ష్మి ప్రసన్న, తహశీల్దార్ మధుసూదనరావు, విస్తరణ అధికారి మూర్తి, స్టేషన్ హౌస్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నాగులుప్పలపాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాబోయే మూడు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున మండలంలోని అన్నిశాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి (డిపిఒ) గొట్టిపాటి వెంకటనాయుడు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో తుపాన్ ముందస్తు చర్యల్లో భాగంగా వివిధశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంత వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు తుపాను వచ్చిన తరువాత ఉపశమన చర్యలు చేయవచ్చు అని నిర్లక్ష్యం వహించకుండా ముందస్తుగానే నష్టనివారణ చర్యలు చేపట్టాలన్నారు అందుకొరకు మండల గ్రామ స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలతో సమన్వయం చేసుకొని ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం సముద్రతీర ప్రాంతమైన కనపర్తి పంచాయతీని సందర్శించి గ్రామస్తులకు తుపాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వై.మహలక్ష్మి, తహశీల్దార్ కె.ప్రవీణ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఇ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు, శానిటేషన్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో అధికారులకు సూచనలిస్తున్న డిపిఒ

'స్విమ్స్'లో పేదలకు అందుబాటులో వైద్యసేవలు

హాస్పిటల్ ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, ఎఎస్‌పి నాగేశ్వరరావు

హాస్పిటల్ ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ దామచర్ల జనార్ధన్

ప్రజాశక్తి - ఒంగోలు

నగరంలోని 60 అడుగుల రోడ్డులో ఏర్పాటు చేసిన స్విమ్స్ హాస్పిటల్ (రాఘవేంద్ర శ్రీనివాస హాస్పిటల్) పేదలకు అందుబాటులో వైద్యసేవలు అందిస్తారని శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ తెలిపారు. స్విమ్స్ హాస్పిటల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు ఎన్నో ఏళ్లుగా పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్నారని చెప్పారు. ఆయన ఆధ్వర్యంలో స్విమ్స్‌లోనూ పేదలకు అందుబాటులో మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయని చెప్పారు. ఎఎస్పీ నాగేశ్వరరావు మాట్లాడుతూ స్విమ్స్ హాస్పిటల్ ప్రారంభం సందర్భంగా డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాఘవేంద్ర శ్రీనివాస హాస్పిటల్‌ను స్విమ్స్ హాస్పిటల్‌గా పేరు మార్చినట్లు తెలిపారు. పేదలు, మధ్య తరగతి ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. 24/7 వైద్యసేవలు అందిస్తామని చెప్పారు. పేదల కోసం తమ హాస్పిటల్‌లో ఓపీ రూ.100 మాత్రమే తీసుకుంటున్న విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. ఉపాస్ డైరెక్టర్లు డాక్టర్ ప్రకాశ్ చావల, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ దీపిక, డాక్టర్ జి శ్రీనివా సరావు, డాక్టర్ చెంచయ్య, డాక్టర్ మద్దిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ నవీన్ బాబు, డాక్టర్ శ్రీధర్ చివుకుల పాల్గొన్నారు.

డాక్టర్ గదిని ప్రారంభిస్తున్న ఎఎస్‌పి నాగేశ్వరరావు

దాతృత్వాన్ని చాటుకున్న వేములపల్లి

ప్రజాశక్తి - వేమూరు

చల్లపల్లి మండలం ఆముదార్లంక గ్రామంలో వేములపల్లి రాఘవేంద్రరావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆయన సొంత నిదులతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎస్సీ కాలనీలో సొంత నిధులతో డైరెక్ట్ వాటర్ పంప్, వాటర్ కొళాయిలు ఏర్పాటు చేశారు. వీటిని అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ ప్రారంభించారు. గ్రామ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టిన రాఘవేంద్రరావు బీసీ కాలనికి వెళ్ళడానికి తన సొంత ఖర్చులతో రోడ్డు నిర్మాణం చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం ద్వారా గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణంకు రాఘవేందర్రావు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ రాఘవేంద్రరావు సేవలను అభినందించారు. పార్టీల కతీతంగా ఆపదలో ఉన్నవారికి సేవ చేయటమే తన లక్ష్యం ముందుకు సాగుతున్నారని అన్నారు. అలాంటి వ్యక్తులు అరుదుగా ఉంటారని అన్నారు. అందర్నీ కలుపుకుపోయే మనసు ఆయనదని అన్నారు. కృష్ణా నది వరదల్లో సైతం తానున్నానంటూ గ్రామస్తులకు భోజనాల ఏర్పాటు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారని అన్నారు. ప్రభుత్వం కంటే ముందున్నారని అన్నారు. ఆముదారలంక గ్రామాన్ని రాష్ట్రంలోనే ముందంజలో ఉంచుతారని అన్నారు. అభివృద్ధిలో ప్రత్యేక గ్రామంగా గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేయలేని పనులు రాఘవేంద్రరావు చేశారని కొనియాడారు. బీసీ కాలనీలోనికి వెళ్లాలంటే జువ్వలపాలెం రోడ్డు ద్వారా వెళ్లాల్సి వచ్చిందనే ఇబ్బందిని గ్రహించిన రాఘవేంద్రరావు ధాతృత్వాన్ని చాటుకున్నారని అన్నారు. గ్రామంలో సిసి రోడ్లు నిర్మించడానికి రూ.86లక్షల ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో పనులకు బుద్ధ ప్రసాద్ శంకుస్థాపన చేశారు. చల్లపల్లి మండలంలో వరద ముంపుకు గురైన గ్రామంలో సిసి రోడ్లు, పక్కాగ్రహాల నిర్మాణం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవభక్తుని నాగవీర బసవయ్య, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఆముదంలంక గ్రామస్తులతో బుద్ధ ప్రసాద్

ఎంపిడిఒగా మహబూబ్ సుభాని

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ఎంపిడిఒ సుభాని

నూతన ఎంపిడిఒగా షేక్ మహబూబ్ సుభాని ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో అమర్తలూరు మండలంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారు. గతంలో చెరుకుపల్లిలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి మరల సాధారణ బదిలీల్లో చెరుకుపల్లికి వచ్చారు. మండల అభివృద్ధికి, వివిధ అభివృద్ధి పథకాల అమలుకు కృషి చేస్తానని, మండల అభివృద్ధికి తోడ్పడతానని పేర్కొన్నారు.ం

నేడు మద్యం షాపులకు లాటరీ

ప్రజాశక్తి - బాపట్ల

ఎక్సైజ్ సిఐ గీతిక

ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం విధానానికి అనుగుణంగా జిల్లాలోని 117 షాపులకు 2164 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సిఐ గీతిక ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు కలెక్టర్, ఇతర అధికారుల సమక్షంలో లాటరీ తీసే ప్రక్రియ బాపట్ల - జమ్ములపాలెం రోడ్డులోని ఎంఎస్ఆర్ కళ్యాణ మండపంలో ప్రారంభం అవుతుందని తెలిపారు. షాపుల కోసం దరఖాస్తు చేసుకున్న దుకాణ దారులు ఉదయం ఏడున్నరకే లాటరీ తీసే ప్రదేశానికి చేరుకోవాలని సూచించారు.

ప్రపంచ తెలుగు సాహితీ ఉత్సవానికి ఆహ్వానం

ప్రజాశక్తి - బాపట్ల

ఎ మల్లికార్జునరావు

ప్రపంచ తెలుగు సాహితీ కళా ఉత్సవానికి బాపట్లకు చెందిన రచయిత, కవి, ట్రాన్స్ కో విశ్రాంత ఉద్యోగి అడుసుమల్లి మల్లికార్జునరావుకు ఆహ్వానం అందినట్లు ఎపి ట్రాన్స్ కో రిటైర్డు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి ఆలపర్తి నారాయణస్వామి ఆదివారం తెలిపారు. ఈ నెల 19, 20 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో శ్రీ శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో 24 గంటల పాటు నిర్వహించే ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవానికి మల్లికార్జునరావు ఆహ్వానం అందినట్లు తెలిపారు. అక్కడ జరిగే ప్రపంచ తెలుగు సాహితీ ఉత్సవంలో ఆయన పేరు ప్రపంచ తెలుగు సాహితీ రికార్డుల్లో నమోదవుతాదని తెలిపారు. మల్లికార్జునరావును పట్టణానికి చెందిన ప్రజాకవి, ప్రముఖ వైద్యులు శ్రీనివాస్, బాపట్ల గ్రంథాలయ అధికారి శివాజిగణేషన్, పలువురు సాహిత్య అభిలాషులు అభినందించారు.

నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న నక్కా ఆనందబాబు

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని క్రీస్తులంక గ్రామంలో ఎఇఎల్‌సి సంఘం ఆధ్వర్యంలో వరద బాధిత కుటుంబాలు 300మందికి శాసన సభ్యులు నక్క ఆనందబాబు, ఎఇఎల్‌సి సెక్రెటరీ చిన్నం కిషోర్ చేతుల మీదగా నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నక్క ఆనందబాబు మాట్లాడుతూ మండలంలో ఇలాంటి వరదలు గతంలో ఎన్నడూ చూడలేదని అన్నారు. ప్రభుత్వం, అధికారులు ముందుగా అప్రమత్తంగా ఉండడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అన్నారు. పంట నష్టం మాత్రమే జరిగిందని అన్నారు. వరదల సమయంలో మంచినీరు, ఆహారం, నిత్యవసర వస్తువులు వరద బాధితులకు ఇబ్బంది కలగకుండా అందించగలిగినట్లు చెప్పారు. వరద తగ్గిన వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం అందించామని అన్నారు. ప్రభుత్వ సహకారంతోపాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి బాధితులను ఆదుకున్నాయని అన్నారు. అందులో భాగంగానే క్రీస్తులంకలో వరద బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసిన స్వచ్ఛంద సంస్థకు, సంఘ పెద్దలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య ప్రతినిధులకు గజిట్ లేఖ అందజేస్తున్న ఎంపీ

పట్టువస్త్రాల బహూకరణ ఉత్తర్వుల పట్ల హర్షం

ప్రజాశక్తి - పర్చూరు

బాపట్ల ఎంపీ తేనేటి కృష్ణ ప్రసాద్ స్థానిక వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారిని దసరా పండుగ సందర్భంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా పెనుగొండ శ్రీ వాసవీ అమ్మవారి ఆలయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు బహుకరించే విధంగా ఉత్తర్వులు ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి, శాసన సభ్యులు ఏలూరు సాంబశివరావుకు వాణిజ్య విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడిపాక హరిప్రసాదరావు కృతజ్ఞతలు తెలిపారు. దేవస్థాన అధ్యక్షులు శ్రీరాం సుబ్బారావు, టిడిపి మండల అధ్యక్షులు షేక్ సంశిద్దీన్, కిరణం మర్చంట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మురళి హనుమంతరావు, పవన్ సుబ్బారావు, నాగేశ్వరరావు, ఊటుకూరు నిర్మల, అనసూయమ్మ తదితరలు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌కు ఘనస్వాగతం పలికి సన్మానం చేశారు. తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెద్దపల్లివరు విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని పెదపులివర్రు ఫీడర్ పరిధిలో మరమత్తుల కారణంగా విద్యుత్ సరఫరా సోమవారం నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇన్చార్జి ఎఈ శాంత కుమారి తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని గొరిగపూడి, కన్నెగంటి వారిపాలెం, ఓలేరు గౌడపాలెం, పాత దళితవాడ, తూర్పుపాలెం గ్రామాల్లో ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా దసరా సంబరాలు

ప్రజాశక్తి - చీరాల

పూజా కార్యక్రమంలో ఎంఎల్‌ఎ కొండయ్య దంపతులు

దసరా పండుగ సందర్భంగా స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పారువేటకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వివిధ ఆలయాల దేవాత మూర్తులు భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా జరిగిన పూజల్లో ఎంఎల్‌ఎ కొండయ్య, బాల కొండమ్మ దంపతులు పాల్గొ న్నారు. దేవీ నవరాత్రి నగరోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అమ్మవారి నగరోత్సవ ప్రతిమలను సందర్శించుకున్నారు. గోపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ కొండయ్య మాట్లాడుతూ మహిషాసుర మర్ధిని అమ్మవారి కరుణా కటాక్షాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, చంద్రబాబు విజనరీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

దామావారిపాలెంలో దువా పోటీలు

ప్రజాశక్తి - అద్దంకి

దువా పోటీల్లో పాల్గొన్న ముస్లిం మహిళలు

జమియా సుబులుస్సలాం లిల్ బనాత్ ఆధ్వర్యంలో దువా పోటీ దామావారిపాలెం సమీపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది పిల్లలు పోటీల్లో పాల్గొన్నారు. అందరూ చక్కగా దువాలు అప్పజెప్పి బహుమతులు అందుకున్నారు. ఆసియా ప్రథమ, నాసిహ ముస్తఖీం ద్వితీయ, నాజిహ ఇర్ఫాన్ తృతీయ బహుమతులు అందుకున్నారు. 10మంది పిల్లలు రూ.100 చొప్పున బహుమతి అందుకున్నారు. పాల్గొన్న వారందరికీ భాగస్వామ్య బహుమతులుగా పుస్తకాలు బహుమతులుగా అందించారు.

పంటలకు జీవం పోసిన వర్షం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ప్రాంతంలో ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది. ఈ వర్షానికి పంటలు జీవం పోసుకున్నాయి. గత కొద్ది రోజులుగా సరైన వర్షాలు లేకపోవడంతో మిరప నారు నాటిన రైతులు మొక్కలు బతికించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. పత్తి పంట ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. వర్షం కురవక నీటి తడులు లేక బెట్టకొచ్చి పూత, పిందె రాలుతోంది. కందిపైరు పరిస్థితి ఇదే విధంగా మారింది. బొప్పాయి, అరటి, తోటలు వాడుబడుతున్నాయి. ఈ క్రమంలో కురిసిన వర్షం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంటలకు వారం, పది రోజులు పాటు నీటి తడులు అవసరం ఉండదని రైతులు చెబుతున్నారు.

వర్షానికి జీవం పోసుకున్న పత్తి పంట

జీవంపోసుకున్న అరటి తోట

ఉచిత అన్నదానం అభినందనీయం

యువ నాయకుడు బాలినేని ప్రణీత్ రెడ్డి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

డొక్కా సీతమ్మ పేరిట ఉచిత అన్నదానం నిర్వహించటం అభినందనీయమని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి కుమారుడు, యువ నాయకుడు బాలినేని ప్రణీత్ రెడ్డి తెలిపారు. ఒంగోలు నగరంలో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ ఉచిత అన్నదాన కార్యక్రమం 88వ రోజుకి చేరుకుంది. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలినేని ప్రణీత్ రెడ్డి పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ప్రణీత్ రెడ్డి మాట్లాడుతూ డొక్కా సీతమ్మ స్ఫూర్తితో పవన్ కళ్యాణ్ ఆశయాల సాధనలో జనసేన పార్టీ ప్రచార కమిటీ జిల్లా కోఆర్డినేటర్ జడ బాల నాగేంద్రయాదవ్ 88 రోజులుగా ఉచితంగా అన్నదానం నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. అన్నార్థులైన పేదలు, ఆకలితో ఉన్న వారి కోసం అన్నదాన కార్యక్రమం చేపట్టిన జడ బాలనాగేంద్ర యాదవ్, మిత్ర బృందానికి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రతి రోజు అన్నదానం చేయటం వ్యయ ప్రయాసలతో కూడుకుందని, ఈ కార్యక్రమానికి బాలినేని కుటుంబ తరపున ఆర్థిక సాయం, అండదండలు ఎప్పుడూ ఉంటాయన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు నచ్చి తమ కుటుంబం పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి రాష్ట్రవ్యాప్తంగా, జిల్లాలో తమ వంతు కృషి చేస్తామన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బ్రహ్మనాయుడు, గంథం నరేష్, కోటా సుధాకర్, కరేటి కిరణ్‌కుమార్, కొప్పూరి నంద కిషోర్ పాల్గొన్నారు.

అన్నదానంలో పాల్గొన్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

'పల్లె పండుగ'లో సర్పంచులు భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 14 నుంచి 20 వరకూ నిర్వహించ తలపెట్టిన పల్లె పండుగ వారోత్సవాలలో సర్పంచులు పాల్గొని జయప్రదం చేయాలని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి. వీర భద్రాచారి పిలుపు నిచ్చారు. సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టులో ప్రతిపాదించిన విధంగా గ్రామాలలో ఉపాధి హామీపథకం పనులు ప్రారంభోత్సవాలు పేరిట నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం మంచి కార్యక్రమన్నారు. గ్రామ పంచాయతీ సర్పంచి, పాలక వర్గ తీర్మానాలు, ప్రాధాన్యతలను అధికారులు అతిక్రమిస్తే సహించేది లేదన్నారు. పనులు మంజూరు, నిర్వహణలపై నేటికీ పంచాయతీలకు ఎలాంటి సమాచారం లేదన్నారు. పంచాయతీలకు పనుల వివరాలు తెలుపకుండా ప్రారంభోత్సవాలు ఎలా చేపడతారన్నారు. అధికారులు గత ప్రభుత్వ పోకడలే నేడు కొనసాగిస్తున్నారని వీరభద్రా చారి మండిపడ్డారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ఈ పథకం ప్రయోజనాలు ప్రతి గ్రామ అభివృద్ధిలో అగ్రభాగంగా ఉంటున్న సందర్భంలో నిధులు వినియోగంలో ఉపాధి హామీ చట్టం ఉల్లంఘన సహించ బోమన్నారు. రాష్ట్రంలో సగానికి పైగా పంచాయతీలకు కేంద్రం విడుదల చేస్తున్న ఆర్థిక సంఘం, ఉపాధి చట్టం నిధులే దిక్కుగా ఉన్నాయన్నారు. సోషల్ ఆడిట్ పేరిట అధికారులు అవినీతికి పాల్పడి పథకం ఉద్దేశ్యాన్ని మంట గలుపుతున్నారన్నారు. సోషల్ ఆడిట్ విధానం పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మన్నం శ్రీనివాస్, ప్రసాద్, మోహనరావు, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

'నెట్' మిరప నారుకు తగ్గిన గిరాకీ

- పంట సాగుపై రైతుల్లో అనాసక్తి
- ధరలు తగ్గడమే కారణం
- నాటు మిరప నారుకు గిరాకీ

ప్రజాశక్తి - ఇంకొల్లు

నర్సరీ షెడ్లలో పెంచే హైబ్రిడ్ మిరప నారుకు గిరాకీ తగ్గింది. గతేడాది హైబ్రిడ్ రకాలైన నెంబర్ 5, 355, తేజా లాంటి మిరప నారు మొక్క ధర రూ.2 నుంచి రూ.3 పలికింది. దీంతో నెట్ మిరప నారు పెంపకం దారులకు లాభాలు వచ్చాయి. ఈ ఏడాది హైబ్రిడ్ మిరప నారు ధరలు దిగజారి పోయాయి. నెంబర్ 5, 355, తేజ హైబ్రిడ్ రకాల మిరప నారు మొక్క రూపాయికి మించి రైతులు కొనే పరిస్థితి లేదు. కొన్నిచోట్ల ఎక్కువ మొత్తంలో నారు కొనుగోలు చేస్తే 80పైసలకు కూడా నెట్ నిర్వాహకులు విక్రయిస్తున్నారు.

అధికంగా నర్సరీల ఏర్పాటు

మిరప, వివిధ రకాల కూరగాయల మొక్కలు పెంచే నర్సరీలు గత రెండేళ్లలో విస్తతంగా పెరిగాయి. మార్టూరు మండలంలోని బొబ్బేపల్లి, మార్టూరు, ద్రోణాదలలో మిరప నర్సరీలు ఉండేవి. గత ఐదేళ్లలో నర్సరీలు విస్తరిస్తూ దాదాపు మార్టూరు, ఇంకొల్లు, ద్రోణాల, పరిసర ప్రాంతంలో 25పైగా మిరప నారు పెంపకం నర్సరీలు ఏర్పాటు చేశారు. బొబ్బేపల్లి, ద్రోణాదల, మార్టూరు, రాజుగారిపాలెం తదితర ఎర్ర నేలలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బోర్ల ద్వారా నీరు లభ్యమవుతుంది. దీంతో ప్రాంతాల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. నర్సరీలకు బిందు సేద్యం కోసం అవసరమైన పరికరాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీపై అందిస్తున్నాయి. దీంతో నర్సరీ నిర్వాహకులు, ఉద్యానవన శాఖ ద్వారా పైపులు, నెట్లు, షీట్లు సబ్సిడీపై పొందుతున్నారు. గత మూడేళ్ళ వరకూ మిర్చి ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు మిరప సాగుపై మొగ్గు చూపారు. నాటు రకాల మొక్కల కన్నా నర్సరీల్లో పెంచే హైబ్రిడ్ వెరైటీ మొక్కల వైపు మొగ్గు చూపారు. హైబ్రిడ్ వెరైటీలైతే అధిక దిగుబడి రావటంతో పాటు నెంబర్ ఫైవ్, తేజ 355 లాంటి మిరప పంట విదేశాలకు ఎగుమతులకు వ్యాపారులు ఎక్కువగా కొనుగోలు చేసేవాళ్లు. దీంతో ఆ రకాల సాగుపైన రైతులు ఎక్కువ మొగ్గు చూపారు.

నెట్‌లో సాగు చేసిన మిర్చినారు

తగ్గుతున్న మిరప సాగు

గత మూడు, నాలుగేళ్లుగా మిరపకు ఎక్కువగా నల్లి, తలనత్త, పసుపు తెగుళ్ళ రావటంతో దిగుబడులు తగ్గుముఖం పట్టాయి. ప్రకృతి వైపరీత్యాలతో మిరప తోటలు నవంబర్, డిసెంబర్ నెలలో దెబ్బతిని, ఒకరెత్తి తోటలో పీకేసిన సందర్భాలు ఉన్నాయి.

నిల్వ ఉంచిన ఫలితం లేదు

ధరలు సరిగ్గా గిట్టుబాటు కావటం లేదని రైతులు అందుబాటులో ఉన్న శీతల గిడ్డంగుల్లో మిరప నిల్వ చేస్తున్నారు. అయినా మిరప నిల్వ రైతులకు అద్దెల భారం, పెట్టిన పెట్టుబడులకు వడ్డీలు అదనం తప్ప ఆశించిన ధర లభించే పరిస్థితి లేదు. దీంతో రైతులు నష్టాల పాలవుతున్నారు.

నేడు 'మీకోసం' రద్దు

ప్రజాశక్తి -ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తున్న 'మీకోసం' ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.శ్రీలత తెలిపారు. జిల్లాలో మద్యం షాపుల కేటాయింపు కోసం సోమవారం లాటరీ ప్రక్రియను నిర్వహించాల్సి ఉందన్నారు. కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు ఈ ప్రక్రియలో పాల్గొనాల్సి ఉండటంతో 'మీకోసం' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఆమె వివరించారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలన్నారు. దూరప్రాంతాల నుంచి ఎవరూ ఒంగోలు రావద్దని డిఆర్ఒ సూచించారు.

14న వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ముస్లిం యూత్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 14న స్థానిక కష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవిత చరిత్రపై వ్యాసరచన మరియు డిబేట్ పోటీలు నిర్వహిస్తున్న ఆ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ షేక్ ఇస్మాయిల్ ఆదివారం తెలిపారు. 8, 9, 10వ తరగతి చదివే విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ప్రతి పాఠశాల విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈనెల 15న నిర్వహిస్తున్న కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

20న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని మాచర్ల రోడ్డులోనున్న ముస్లిం షాదీఖానాలో ఈనెల 20న మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ మరియు శాంతిరామ్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ షేక్ ఇస్మాయిల్ ఆదివారం తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చే వారు ఆరోగ్యశ్రీ , ఆధార్ కార్డులు తమ వెంట తెచ్చుకోవాలన్నారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగానే ఆపరేషన్లు చేయించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రైతులకు పైపులు అందేలా చర్యలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రజాశక్తి కథనానికి స్పందన

యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల వారీగా రైతులకు రాయితీపై సరఫరా చేసే పివిసి పైపుల జాబితా ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపినట్లు యర్రగొండపాలెం వ్యవసాయ సహాయ సంచాలకురాలు కె.నీరజ తెలిపారు. ప్రజాశక్తి దినపత్రికలో ఈనెల 12న భారంగా పైపుల ధరలు అనే శీర్షికతో ఓ కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి నీరజ స్పందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందిన వెంటనే అర్హత కలిగిన ప్రతి రైతుకు పైపులు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - చీరాల

మండల పరిధిలోని వాడరేవు వద్ద నూతన రహదారి నిర్మాణం వద్ద కల్వర్టు కాలువలో వేటపాలెం మండలం పాపాయిపాలెంకు చెందిన పులి శ్రీనివాసరావు (45) అలియాస్ బాతుల శ్రీను మృతిచెందాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న చీరాల ఎమ్మెల్యే కొండయ్య ఆదివారం రాత్రి శ్రీను మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు నివాళ లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీను మతి పట్ల తమకు అనుమానాలు ఉన్నట్లు మృతుడి బంధువులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారని ధైర్యంగా ఉండాలన్నారు. కేసు దర్యాప్తును వేగవంతం చేసి అసలు విషయాలు వెలుగులోకి తీసుకొచ్చి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఎమ్మెల్యే పోలీసులను ఆదేశించారు.

కుక్క అడ్డు రావడంతో... డివైడర్ ఢీకొని వ్యక్తి మృతి

• మరొకరి పరిస్థితి విషమం • పండగ వేళ వలపర్లలో విషాదం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

పండగ వేళ రెండు కుటుంబాల్లో విషాదం చోటు చేసుకుంది. సర్వీస్ రోడ్డులో కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పి డివైడర్ ఢీ కొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరొకరు తీవ్రగాయాలతో కోమాలోకి వెళ్లి వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషాద ఘటన అమరావతి స్పిన్నింగ్ మిల్ సమీపంలో సర్వీస్ రోడ్డులో చోటుచేసుకుంది. ఎఎస్ఐ షేక్ సైదా చెప్పిన ప్రకారం వలపర్ల ఎస్సి కాలనిలో నివాసం ఉండే కొప్పుల సుబ్బారావు (53), గారపాటి శ్రీనివాసరావు జొన్నతాళి వద్ద ఉన్న పైపుల కంపెనీలో కార్మికులుగా పనిచేస్తున్నారు. విధులు అనంతరం వీరువురు సుబ్బారావు బైకుపై మార్టూరులోని ఓ సెల్ దుకాణంలో ఫోన్ కొనుగోలు నిమిత్తం వివరాలు అడిగి తిరిగి తమ స్వగ్రామం వలపర్ల వెళుతున్నారు. ఈ క్రమంలో వీరి బైక్ మార్టూరు దాటిన కొద్దిసేపటికే జాతీయరహదారిపైకి అనుకోని ఉన్న సర్వీస్ రోడ్డులో వెళుతున్నారు. బైకుకు ఒక్క సారిగా కుక్క అడ్డురావడంతో బైక్ అదుపు చేయలేక రోడ్డు ప్రక్క డివైడర్ ఢీ కొట్టారు. ప్రమాదంలో బైక్ నడుపుతున్న సుబ్బారావు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. వెనుక కూర్చున్న శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలు అయ్యాయి. గురై కోమాలోకి వెళ్ళాడు. వెనుక వస్తున్న వాహనదారులు ప్రమాదాన్ని గుర్తించి 108, పోలీసులకు సమాచారం ఇచ్చారు. 108 వాహనం అందుబాటులోకి రాకపోవడంతో తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతున్న శ్రీనివాసరావును స్థానికులు బైకుపై మార్టూరు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు కాటూరి ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న ఎఎస్ఐ షేక్ సైదా ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం స్థానిక వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడు దుర్గాప్రసాద్

కొద్దిసేపట్లో ఇళ్లు చేరేలోపే ప్రమాదం

వలపర్ల ఎస్సి కాలనీకి చెందిన ఆరుగురు పైపుల కంపెనీలో కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారు. విధులు ముగిసిన అనంతరం నలుగురు రెండు బైకులపై వలపర్ల వెళ్లారు. ప్రమాదానికి గురైన ఇద్దరు మార్టూరు వెళ్లి వస్తామని చెప్పి తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదం అనంతరం స్థానికులు వీరి వద్ద ఉన్న సెల్ ఫోన్‌లో నంబర్ల ఆధారంగా సమాచారం అందించడంతో వలపర్ల నుండి వీరి బంధువులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. వీరి సమాచారం పోలీసులకు తెలిసింది. రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెంది మరొకరు కోమాలోకి వెళ్లడంతో వలపర్ల ఎస్సి కాలనిలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పూల ధరలు పెరిగినా.. రైతుకు దక్కని ఫలితం

• వర్షాలకు దెబ్బతిన్న పూల తోటలు • పూల తోటల రైతులను ఆదుకోవాలని వేడుకలు

ప్రజాశక్తి - బాపట్ల

పూల ధరలకు రెక్కలు వచ్చాయి. ఒక్కసారిగా పూల ధరలు నాలుగు రెట్లు పెరిగాయి. రూ.150 ఉన్న జాజుల ధర రూ.400కు చేరింది. కిలో రూ.100 ఉన్న బంతిపూలు ధర రూ.250 పలుకుతుంది. రూ.150 ఉన్న కిలో గులాబీల ధర రూ.400కు చేరింది. రూ.100గా ఉన్న చామంతి రూ.300కు పెరిగింది. రూ.300 ఉన్న కాగడాల పూల ధర రూ.800 పలుకుతోంది. రూ.200 ఉన్న కిలో మల్లెపూల ధర రూ.800 ఇచ్చినా దొరకడం లేదు. ఊహించని రీతిలో పూల ధరలు పెరిగినప్పటికీ బాపట్ల ప్రాంతంలో పూల తోటలు సాగు చేసే సన్న, చిన్నకారు రైతులకు ప్రయోజనమేమి కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలోని బేతపూడి, వెదుళ్ళపల్లి, కొత్త కంకటపాలెం, సమీప గ్రామాలైన చీరాల మండలంలోని తులసినగర్, కావూరివారిపాలెం, బాపట్ల పట్టణ పరిసర ప్రాంతాల్లోని మూర్తిరక్షణ నగర్, ఉప్పరపాలెం శివారులో అత్యధికంగా చామంతి, బంతి, కాగడాలు, మరువం, కనకాంబరాలు, సన్నజాజుల పూల తోటలు సాగు చేస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు పూల తోటలు దెబ్బతినడంతో పూల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. వినాయక చవితి పండుగ రోజులు ప్రారంభమై విజయదశమి, దీపావళి, కార్తీక మాసం, క్రిస్మస్, జనవరి, సంక్రాంతి వరుస పండుగలతో పూలకు మంచి గిరాకీ ఏర్పడుతుంది. పూల తోటలు సాగు చేసే రైతులకు వర్షాలతో తీరని ఎదురు దెబ్బ తగిలింది. దాదాపుగా ఈ ప్రాంతంలో సాగు చేసే పూలను రైతులు వెదుళ్ళపల్లి మార్కెట్లో విక్రయిస్తుంటారు. ఇక్కడి నుండి హైదరాబాదు, విశాఖపట్నం, చెన్నై, విజయవాడ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. అంతటి ఉత్పత్తి సామర్థ్యం గల బాపట్ల ప్రాంతానికి ఈ ఏడు కుప్పం, చిత్తూరు, బెంగళూరు ప్రాంతాల నుండి బంతి, చామంతి, గులాబీలు దిగుమతి చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. పూల తోటలు సాగు చేసే రైతులు సైతం తోటలు దెబ్బ తినడంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకునే పూలు తెచ్చుకుని మారుబేరానికి చిల్లరగా అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. పూలకు ధరలు పెరిగాయని తెలిసినప్పటికీ కొనుగోలు దారులు తక్కువ ధరకు అడగడంతో కూలిపాటు సైతం దక్కకపోగా ఒక్కొక్కసారి పూలు మిగిలిపోయి నష్టాన్ని భరించాల్సి వస్తుందని పూల అమ్ముకునే మహిళా రైతులు వాపోతున్నారు.

పూల రైతులకు రాయితీలు ఇవ్వాలి

చంద్రారెడ్డి, పూల వ్యాపారి, వెదుళ్ళపల్లి పూల మార్కెట్

ఇప్పటివరకు బాపట్ల ప్రాంతంలో సాగయ్యే అనేక రకాల పూలను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేవాళ్లం. అయితే ఆగస్టు, సెప్టెంబర్లో కురిసిన వర్షాలకు పూలతోటలు దెబ్బ తినడంతో బెంగళూరు ఇతర ప్రాంతాల నుంచి బంతి, చామంతి, గులాబీ, కాగడ, సన్నజాజులు దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గిరాకీని బట్టి దాదాపుగా అక్కడే వ్యాపారులు పూల ధరలను పెంచేసి పంపిస్తున్నారు. ఇక్కడ ధరలు పెంచక తప్పడం లేదు. బాపట్ల, వెదుళ్ళపల్లి, బేతపూడి, స్టువర్టుపురం ప్రాంతాల్లో పూల తోటలు సాగు చేసి రైతులను ప్రోత్సహించాలని కోరారు. కాలానుగుణంగా ఉత్పత్తి అయ్యే పూల తోటలకు ప్రభుత్వం రాయితీలు ప్రకటించాలని కోరారు. మేలైన పూల వంగడాలు సాగుచేసే విధంగా సన్నచిన్న కారు పూల రైతులకు ప్రభుత్వం రాయితీలు ప్రకటించాలని కోరారు. పూల ఉత్పత్తులు పెరిగితే ఆయా లాభాలు రైతులకే చెందుతాయని అన్నారు. పూల తోటలు సాగు చేసే మహిళా రైతులే పూలు కొనుక్కెళ్ళి అమ్ముకోవాల్సి వస్తోంది. ఇదంతా కేవలం ఇటీవల కురిసిన వర్షాలకు పూల తోటలు దెబ్బ తినడమే ప్రధాన కారణం.

వెదుళ్ళపల్లి పూల మార్కెట్లో అమ్మకానికి సిద్దంగా ఉన్న పూలు

ప్రభుత్వం ఆదుకోవాలి

కోకి కృష్ణవేణి, పూల తోటల మహిళా రైతు, బాపట్ల ఉప్పరపాలెం

పూల తోటలు సాగు చేసి పూలు అమ్ముకోవాల్సిన మహిళా రైతులే వెదుళ్ళపల్లి మార్కెట్లో పూలు కొనుక్కొచ్చుకొని అమ్ము కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడు పూల తోటల సాగుపై ఎన్నో ఆశలు పెంచుకున్నాం. ఆదిలోనే హంస పాదులా వర్షాలకు పూల తోటలు దెబ్బతిన్నాయి. మేము సాగు చేసిన పూలనే అమ్ముకొనే వాళ్ళం. తోటలు దెబ్బ తినడంతో మారు బేరానికి తెచ్చి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాలకు తోటలు దెబ్బతిన్నప్పటికీ సంబంధిత ప్రభుత్వ అధికారులు మాత్రం ఈ ప్రాంతంలో పూల తోటలకు అంతగా దెబ్బ తినలేదని కనీసం నష్టపరిహారం చెల్లించటానికి సైతం ముందుకు రాలేదు. రానున్న రోజుల్లో పండుగల సీజను దృష్ట్యా ఈ ప్రాంతంలో పూల తోటలో విస్తీర్ణాన్ని మరింతగా పెంచి పూల తోటలు సాగు చేసే రైతులను ప్రోత్సహించాలి. పూల సాగు రైతులకు ప్రభుత్వం సబ్సిడీలు ఇవ్వాలి. పూల తోటలో సాగుపై ఆధారపడి జీవించే కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చే దిశగా ప్రభుత్వం పూల తోటల సాగునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

దసరా ఉత్సవాల్లో బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్

వాసవీ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ కృష్ణ ప్రసాద్

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఎంపి తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు శ్రీరాం వెంకట సుబ్బారావు అమ్మవారి విశిష్టతను వివరించారు. ఆర్యవైశ్య ప్రముఖులు ఆయనను సన్మానించారు. విజయదశమి రోజున అమ్మవారిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఎంపీ కృష్ణ ప్రసాద్ అన్నారు.

రేపల్లె : కనకదుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని మంత్రి సత్యప్రసాద్ సోదరులు అనగాని శివప్రసాద్ అన్నారు. మండలంలోని బేతపూడిలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ అమ్మవారి విగ్రహ పూజల్లో ఆయన మాట్లాడుతూ చెడుపై మంచి, దుష్ట శక్తుల మీద దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని అన్నారు. ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బేతపూడి తెలుగుదేశం నాయకులు పర్చురి రాఘవ పాల్గొన్నారు.

ఇంకొల్లు : దసరా నవరాత్రులు ముగింపు సందర్భంగా ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని రాజరాజేశ్వరి అవతారంలో అలంకరించారు. అమ్మవారి నగరోత్సవం నిర్వహించారు. స్థానిక భీమేశ్వర ఆలయంలో జమ్మిచెట్టుకు పూజ చేశారు. చెన్నకేశవ ఆలయంలో మహిళలు పూజ చేసి పారు వేట నిర్వహించారు. పద్మా లంకమ్మ గుడి, శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గుడి, వీరభద్రేశ్వరాలయం, శిరిడి సాయిబాబా మందిరాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అన్న ప్రసాదాలు వినియోగించారు.

రేపల్లెలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న శివప్రసాద్

చెరువును తలపిస్తున్న చెరుకుపల్లి ప్రధాన రహదారి

ప్రమాదకరంగా రహదారి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

స్థానిక ఐలాండ్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం ఎదురు పెద్ద గొయ్యి ఏర్పడి చెరువును తలపిస్తుంది. అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్డు వేయకపోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారి నిర్మాణ సంస్థకు అంబేద్కర్ విగ్రహం పెట్టే విషయంలో ఏర్పడిన జాప్యం వలన రోడ్డు వేయలేదు. దీనివలన వర్షాలు వచ్చినప్పుడు రోడ్డు కోతకు గురై చెరువు లాగా మారుతుంది. గతంలో రోడ్డు బాగాలేనప్పుడు జాతీయ రహదారి నిర్మాణ సంస్థ గోతులు పూడ్చేవారు. ప్రస్తుతం వారు పట్టించుకోవడం లేదు. దీంతో నిత్యం ద్విచక్ర వాహనదారులు, భారీ వాహనాలు రోడ్డుపై ప్రమాదాలకు గురవుతున్నారు. మూడు అడుగుల మేర గొయ్యి పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కనీసం పంచాయతీ అధికారులు కూడా ఏమి చేయకపోవడంతో వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. ఇటీవల గొయ్యిలో పడి రోడ్డు నిర్మాణ సంస్థ వారి వాహనం సైతం దెబ్బతింది. అయినప్పటికీ రోడ్డు బాగు చేయడం లేదని ప్రజలు చెబుతున్నారు. రోడ్డుకు కనీసం మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ప్రజాశక్తి - కారంచేడు

భూ యజమానితో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు కౌలు కార్డులు ఇవ్వాలని, అందుకు అవసరమైన విధివిధానాలు వెంటనే రూపొందించాలని సిపిఎం జిల్లా నాయకులు పి కొండయ్య కోరారు. గత ప్రభుత్వ కాలంలో ఇండ్లు నిర్మించకుండానే బిల్లులు చేసుకున్న వాటిపై విచారణ జరిపించాలని కోరారు. ఆ లబ్ధిదారులకు మళ్లీ హౌసింగ్ మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉత్తర పొలం పులక్కాలవను సొసైటీ, స్మశానం మీదుగా యుటీల వరకు పూడిక తీసి పారుదల కల్పించడం ద్వారా ఈ పొలాలకు ముంపు సమస్య పరిష్కరించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరై ఆపివేసిన వృద్ధాప్య పెన్షన్లు పరిశీలించి అర్హులైన వారికి ఇవ్వాలని సిపిఎం స్వర్ణ గ్రామ జనరల్ బాడీ సమావేశం డిమాండ్ చేసినట్లు గ్రామ కార్యదర్శి సుబ్బారావు తెలిపారు. పంట సాగుకు బ్యాంకుల్లో రుణాలు ఇప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోతే రైతులు, కౌలు రైతులు అందరూ ఐక్యంగా ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం గ్రామ నాయకులు బి ఏడుకొండలు, హనుమంతరావు, ద్రాక్షారపు శీను పాల్గొన్నారు.

నూతన వస్త్ర వేడుకల్లో పాల్గొన్న ఎంఎల్ఏ నక్క ఆనందబాబు

నూతన వస్త్ర వేడుకల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని దోనేపూడి గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకులు, సంఘం డైరీ డైరెక్టర్ గుత్తికొండ లక్ష్మి జ్ఞానానంద భగవాన్ (బుజ్జి)మనవడు, మనవరాలు నూతన వస్త్ర వేడుకలు తెనాలి మండలం పెదరావూరులోని శ్రీ లక్ష్మీ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. శాసన సభ్యులు నక్కా ఆనందబాబు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో తెలుగుదేశం అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్, కోగంటి శివ వెంకటేశ్వరరావు, సిగిలిశెట్టి రాఘవరావు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

• కల్వర్టులో ద్విచక్ర వాహనం, మృతదేహం • వాడరేవు రహదారిలో సంఘటన • మృతుడు పాపాయిపాలెం నివాసి పులి శ్రీను • డాగ్ స్క్వాడ్‌తో ఆధారాల సేకరణ

ప్రజాశక్తి - చీరాల

వాడరేవు నుండి పిడుగురాళ్ల వరకు నూతనంగా నిర్మిస్తున్న రహదారిలో నీటి కుంటలో ద్విచక్ర వాహనంతో సహా వ్యక్తి మృతి చెంది కనిపించాడు. ఈ సంఘటన వాడరేవు పెట్రోల్ బంకు సమీపంలో నూతనంగా నిర్మాణం చేస్తున్న రహదారి కల్వర్టు వద్ద ఆదివారం వెలుగు చూసింది. వేటపాలెం మండలం పాపాయిపాలెంకు చెందిన పులి శ్రీనివాసరావు అలియాస్ బాతుల శ్రీను శని వారం రాత్రి ఇంటి నుండి బయటకు వచ్చాడు. వాకావారి పాలెంలోని తన సన్నిహితులను కలిసేందుకు తరుచుగా వెళుతుంటాడు. ఎంత సేపటికి ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు ఎలాంటి సమాచారం అందకపో వటంతో వాకావారిపాలెంలోని స్నేహితుల వద్దకు వెళ్ళి ఉంటాడని భావించారు. అయితే ఆదివారం ఉదయం బాట సారులకు రహదారి నిర్మాణం కోసం తీసిన కల్వర్టు నీటి కుంటలో ద్విచక్ర వాహన అద్దం నీటిలో కనిపించింది. దింతో అనుమానం వచ్చి స్థానికులు నీటిలో దిగి పరిశీలించగా ఆ ద్విచక్ర వాహనం కింద నీటిలో వ్యక్తి మృతి చెంది విగత జీవుడై పడి ఉన్నాడు. వెంటనే విషయాన్ని ఈపురి పాలెం పోలీసులకు స్థానికు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి పాపాయపాలెంకు చెందిన పులి శ్రీనివాసరావుగా గుర్తించారు. అంతలో సమా చారం అందుకున్న మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకొని బోరున విలిపించారు. వెంటనే వస్తానని ఇంటిలో చెప్పి వెళ్లిన శ్రీనివాసరావు నీటి కుంటలో శవమై కనిపించడంతో కుటుంబ సభ్యులు రోధనలు మిన్నంటాయి. మృత దేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. శ్రీనివాసరావు మృతి పట్ల పోలీసులకు కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేయడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించిన రూరల్ సీఐ శేషగిరిరావు, ఈపురిపాలెం ఎస్ఐ శివకుమార్ కేసు నమోదు చేసి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

శ్రీనివాసరావు(ఫైల్)

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదమా? హత్యా?

వాడరేవు రహదారి నిర్మాణం పనులను నిత్యం గమనిస్తూ మృతుడు పులి శ్రీనివాసరావు ఆ దారిలో అనేక సార్లు రాకపోకలు సాగించేవాడు. ఆయన ఆ మార్గంలో ప్రయాణించే సమయంలో వర్షం కూడ కురుస్తుంది. అదే మార్గంలో ప్రయాణించే ఇతర వాహనం ఏదైనా బలంగా ఢీ కొట్టడంతో మృతుడు వాహనంతో సహా నీటి కుంటలో పడి మృతి చెంది ఉండవచ్చని పలువురు భావిస్తున్నారు. ఇది ఇలా ఉంటే వ్యక్తిగత విభేదాలు మనసులో పెట్టుకొని ఎవరైనా ఉద్దేశపూర్వకంగా హత మార్చి రోడ్డు ప్రమాదంగా చిత్రికరించారనే అనుమానాలు లేకపోలేదు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించి పరిశీలించారు. అయితే ప్రమాద వశాత్తు మరణించాడా? రోడ్డు ప్రమాదమా? లేక హత్య? అనే పూర్తి విషయాలు పోలీసులు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ఘటనా స్థలం వద్ద ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

పరామర్శిస్తున్న మాజీ ఎంఎల్ఎ కరణం బలరామకృష్ణమూర్తి

మృతుడి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - చీరాల

వాడరేవు రహదారి కల్వర్టులో మృతి చెందిన పులి శ్రీనివాసరావు మృత దేహాన్ని ఏరియా వైదశాల వద్దకు వెళ్ళి మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు, మాజీ ఎంఎల్ఎ కరణం బలరామకృష్ణమూర్తి పరిశీలించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండా లని, తాము అండగా ఉంటామని అన్నారు. పులి శ్రీను మృతికి గల పూర్తి కారణాలపై రూరల్ సీఐ శేషగిరిరావుతో చర్చించారు. కేసును వేగవంతంగా దర్యాప్తు చేపట్టి వాస్తవాలను వెలికి తీయాలని అన్నారు. అనంతరం మృతి చెందిన కల్వర్టు వద్దకు చేరుకుని ఆ ప్రాంతాన్ని పరిశీలిం చారు. అందరితో సౌమ్యంగా ఉండే పులి శ్రీనివాసరావు దుర్మరణం చెందటం ఎంతో బాధాకరమని అన్నారు.

నేటి నుంచి 'పల్లె పండుగ'

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరు గ్రామంలో సోమవారం జరిగే పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొంటారని సొసైటీ మాజీ అధ్యక్షులు, తెలుగుదేశం నాయకులు దుద్దేల గాలెయ్య తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల నేతలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రజలు హాజరు కావాలని కోరారు.

పంగులూరు : పంచాయతీ వారోత్సవాల పల్లె పండుగ ఈనెల 14నుండి 20వరకు జరుగుతాయని ఎంపిడిఒ కె స్వరూపరాణి తెలిపారు. 14న నూజిల్లపల్లి, చందలూరు, తూర్పు తక్కెళ్ళపాడు, తూర్పు కొప్పెరపాడు, 15న అలవలపాడు, రేణింగవరం, కసాపురం, 16న జాగర్లమూడి వారిపాలెం, ముప్పవరం, కొండమూరు, 17న బైట మంజులూరు, భగవాన్ రాజుపాలెం, రామకూరు, 18న కొండ మంజులూరు, కోటపాడు, జనకవరం, 19న బూదవాడ, కళ్ళంవారిపాలెం, చిన్నమల్లవరం, 20న ఆరికట్లవారి పాలెం, పంగులూరు గ్రామాల్లో జరుగుతాయని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, నోడల్ అధికారులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

వేమూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ, పంచాయతీ వారోత్సవాలు ఈ నెల 14 నుండి 20వరకు పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులకు అందరూ కలిసి పండుగ వాతావరణంలో భూమి పూజ నిర్వహించాలని శాసన సభ్యులు నక్క ఆనందబాబు సూచించారు. ఈ భూమి పూజ చేసిన పనులు సంక్రాంతిలోపు పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు నడవాలని తెలిపారు. ఈనెల 14న చుండూరు మండలం ఎడ్లపల్లి, అమర్తలూరు, వేమూరు మండలం కుచ్చుల్లపాడు, వెళ్ళబాడు గ్రామాల్లో భూమి పూజలో పాల్గొంటున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు.

భట్టిప్రోలు : పల్లె పండుగ వారోత్సవాలు ఈనెల 14 నుండి 18 వరకు వివిధ గ్రామాల్లో గ్రామసభలు ఆమోదించిన నూతన పనులకు శంకుస్థాపనలు చేపట్టనున్నట్లు ఎంపిడిఒ ఎస్‌వి రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14న గొరిగెపూడి, 16న ఆళ్ళమూడి, పల్లె కోన, సూరేపల్లి, రాచూరు, 18న చింతమోటు, పెదపులివర్రు, ఓలేరు, వెల్లటూరు గ్రామాల్లో సభలు జరుగుతాయని అన్నారు. ఎంపీపీ డివి లలిత కుమారి, జడ్పిటిసి టి ఉదయ్ భాస్కరి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పాలకవర్గ సభ్యులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని కోరారు. 14న భట్టిప్రోలు, ఐలవరం గ్రామాల్లో జరగాల్సిన కార్యక్రమం అనివార్య కారణాల వలన వాయిదా పడినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో కార్యక్రమాలు తర్వాత ప్రకటిస్తామని తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

మాజీ ఎమ్మెల్యే రఘుపతికి స్వాగతం

ప్రజాశక్తి - బాపట్ల

అమెరికా పర్యటన ముగించుకొని బాపట్ల విచ్చేసిన మాజీ శాసన సభ్యులు కోన రఘుపతికి స్థానిక రైల్వే స్టేషన్ వద్ద వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘన స్వాగతం పలికారు. శబరి ఎక్స్ ప్రెస్‌లో రఘుపతి వస్తున్నారని తెలిసి పెద్ద సంఖ్యలో రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఆయనకు గజమాలతో స్వాగతం పలికారు. రైల్వే స్టేషన్ నుండి రథం బజార్లోని వైసిపి కార్యాలయానికి కార్యకర్తలతో కలిసి కాలినడకన చేరుకున్నారు. వైసిపి కార్యాలయంలో కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రం తరలింపు అనే విషయం తెలిసి ఎంతో కలత చెందానని అన్నారు. ఎంతో ఆవేదనకు గురైనట్లు తెలిపారు. జిల్లా కేంద్రం సాధించుకోవటానికి ఎంతో కష్టపడ్డామని అన్నారు. అది తరలిపోతే అభివృద్ధి నిలిచిపోతుందని అన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న వారితో కలిసి జిల్లా కేంద్రం సాధనకు అందరం కృషి చేద్దాం అన్నారు. ఇది అందరి బాధ్యతని అన్నారు. భావితరాలకు మనం ఇచ్చే బహుమానం అన్నారు. వైద్య కళాశాల పనులు ఆపివేశారనే విషయం తెలిసి తన హృదయం చలించిపోయిందని అన్నారు. అన్ని హంగులతో అందరికీ ఉపయోగపడేలా వైద్య కళాశాల సాధించి జమ్ములపాలెం రహదారిలో ఏర్పాటు చేశామని అన్నారు. ఎంతో క్లిష్టమైన పునాదుల పనిని గత ప్రభుత్వంలోనే పూర్తి చేశామన్నారు. ఇప్పుడు బిల్లులు చెల్లించలేక గుత్తేదారు పనులు ఆపేశారని తెలిసి ఎంతో బాధపడ్డట్లు తెలిపారు. ఇప్పుడున్న ప్రభుత్వం వైద్య కళాశాల పనులు తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తాను కూడా ఈ విషయంపై వారితో కలిసి పోరాడటానికి సిద్ధమన్నారు. జిల్లా కేంద్రం, వైద్య కళాశాల రెండు విషయాల్లో బాపట్ల వాసిగా ప్రస్తుతం ఉన్న పార్టీ నాయకులు, శాసన సభ్యులు నిస్వార్థంగా ఆలోచించి పూర్తిచేసే బాధ్యత తీసుకోవాలని కోరారు. బాపట్ల జిల్లా వాసులుగా మనందరం కలిసికట్టుగా ప్రయత్నం చేసి భావితరాలకు వీటిని అందిస్తే బాపట్ల ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందుతుందని అన్నారు. 45శాతం ఓటు బ్యాంకు ఉన్న వైసిపిని ఎవరు ఏమి చేయలేరని అన్నారు. నియోజకవర్గంలో వైసిపి ఎంతో బలంగా ఉందన్నారు. ఓడిపోవడానికి కారణాలు ఏమైనప్పటికీ తిరిగి మరల పుంజుకుంటామని స్పష్టం చేశారు. ఆయన వెంట వైసీపీ కన్వీనర్లు రాఘవరెడ్డి, కాగిత సుధీర్ బాబు, ఏడుకొండలు, నారపరెడ్డి, ఎంపిపి హరిబాబు, వనజ, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు కృష్ణమూర్తి, సీతారామిరెడ్డి, వైస్ ఎంపీపీ సుబ్బారావు, పిట్టలవారిపాలెం ఎంపీపీ రామరాజు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన అగ్రవర్ణాల వారిపై

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

నెల రోజుల క్రితం దళితుడిపై అగ్రకుల పెత్తందారులు కులం పేరుతో దూషించడమే కాక అతనిపై దాడికి ప్రయత్నించిన వారిపై ఇప్పటివరకు ఎందుకు అట్రాసిటీ కేసు నమోదు చేయలేదని ఎంఆర్‌పిఎస్ నాయకులు ప్రశ్నించారు. మండలంలోని పెదలంక మధ్యగూడానికి చెందిన గొరిగెపూడి ప్రసాద్ అనే వ్యక్తి సెప్టెంబర్ 10న స్వగ్రామం నుండి మరో గ్రామానికి వస్తుండగా మార్గమధ్యంలో గ్రామానికి చెందిన రైతు వేములపల్లి జగన్నాథరావు చౌదరి బండి అడ్డు పెట్టాడు. అడ్డుగా ఉన్న బండిని పక్కకు తీయమని అడిగినందుకు అతనిని కులం పేరుతో దూషించటమే కాక తన అనుచరులతో పెదలంక గ్రామంలోని వాటర్ ట్యాంకు వద్దకు పిలిపించి జగన్నాథరావుతోపాటు అతని అనుచరులు మరోసారి కులం పేరుతో దూషిస్తూ చంపుతామని భయభ్రాంతులకు గురిచేసారని పేర్కొన్నారు. అప్పుడే గొరిగపూడి ప్రసాద్ తమపెద్దలతో కలసి భట్టిప్రోలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఆ ఫిర్యాదును పరిశీలించి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, అప్పటి నుండి గ్రామస్తులు భట్టిప్రోలు ఎస్ఐ కోరుతూనే ఉన్నారని తెలిపారు. కానీ ఎస్ఐ అగ్రకుల పెత్తందారులకు తలొగ్గి కేసు నమోదు చేయడం కాదు ముందుగా మీరు స్టేషన్‌కి వస్తే ఇరువర్గాలను పిలిపించి మాట్లాడుతానని కాలయాపన చేస్తూ వచ్చారని ఆరోపించారు. ఎన్నిసార్లు స్టేషన్ చుట్టూ తిరిగి కేసు నమోదు చేయాలని అడిగినప్పటికీ కేసు నమోదు చేయకపోవడంతో గ్రామస్తులు వేమూరు సీఐ, రేపల్లె డిఎస్‌పి, బాపట్ల ఎస్పీ, గుంటూరు డిఐజికి ఫిర్యాదు చేసినట్లు రవి తెలిపారు. గ్రామంలో అగ్రకుల పెత్తందారుల నుండి తనకు ప్రాణహాని ఉందని, తన రక్షణ కల్పించి తనను కులం పేరుతో దూషించి మారణాయుధాలతో చంపుతామని బెదిరించిన వ్యక్తులపై ఫిర్యాదు చేసినప్పటికీ కేసులు నమోదు చేయకపోవడంతో ఎంఆర్‌పిఎస్ నాయకులు బాధిత రవి కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకుని రవి కుటుంబానికి బరోసా కల్పించారు. చాలా రోజులు గడిచినప్పటికీ ఎస్ఐ ఇచ్చిన ఫిర్యాదును నమోదు చేసి విచారించకుండా కాలయాపన చేయడం పట్ల తీవ్రంగా పరిగణించి జిల్లా, రాష్ట్రస్థాయిలో ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలను ఐక్యం చేసి సోమవారం ధర్నా చేయడానికి సిద్ధమైనట్లు తెలిపారు. దాడికి కారణమైన జగన్నాథరావు చౌదరి అనే వ్యక్తి గ్రామంలో దురుసుగా వ్యవహరిస్తూ ఉంటాడని, పొలాలకు కూలి పనులకు వెళ్లే మహిళలు, పురుషులపై కూడా అసభ్యకరంగా మాట్లాడుతూ దౌర్జన్యం చేస్తుంటాడని గ్రామస్తులు ఆరోపించారు. ఇలాంటి వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేయకుండా కాలయాపన చేయటం వలన జరిగే నష్టానికి పోలీసులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎంఆర్‌పిఎస్ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు కూచిపూడి సత్యం, ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు లక్ష్మీ నరసయ్య, దుడ్డు వందనం, గుంటూరు జిల్లా అధ్యక్షులు హృదయ రాజు, దున్న సాంబయ్య, బేతపూడి భాస్కరరావు, నన్నేపాముల నాగేశ్వరరావు, ఆలూరు భిక్షాలు, కూచిపూడి రవీంద్ర, పోలిమట్ల నాగేశ్వరరావు, నల్లూరు రామారావు, కటికల కళాకరరావు, కిషోర్, గోరిగపూడి ప్రసాద్, కారుమూరు నరేష్, గురు ప్రసాద్, కుమార్ రాజా పాల్గొన్నారు.

బాధితుడు ప్రసాద్ ఇంటి వద్ద ఎంఆర్‌పిఎస్ నాయకులు

పోరాటయోధుడు సాయిబాబా

నివాళులర్పించిన ప్రజాసంఘాల ఐక్యవేదిక

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అట్టడుగు వర్గాల హక్కుల పోరాటం చేసిన అలుపెరుగని పోరాట యోధుడు ప్రొఫెసర్ సాయిబాబా అని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ వద్ద ఉన్న మంచి పుస్తకం షాపు వద్ద ప్రొఫెసర్ సాయిబాబా సంతాప కార్యక్రమం ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. తొలుత ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ఒపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ రావు అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రొఫెసర్ సాయిబాబా ఢిల్లీ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ సమాజంలోని ఆదివాసీ, అట్టడుగు వర్గాల హక్కుల కోసం నిలబడిన మేధావి అని తెలిపారు. 90 శాతం అంగవైకల్యం కలిగిన సాయిబాబాను అక్రమ కేసులో నిర్బంధించి తొమ్మిది సంవత్సరాలు నాగపూర్ జైల్లో చిత్రహింసలు పెట్టారన్నారు. బిజెపి ఫాసిస్టు ప్రభుత్వం నిర్బంధించిన ఫలితంగానే సాయిబాబా ఆరోగ్యం క్షీణించిందని, ఇది ఫాసిస్టు ప్రభుత్వ హత్య అన్నారు. చిత్రహింసల్ని ఎదుర్కొంటూనే సమ సమాజం కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడు సాయిబాబా అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ఉద్యమ శక్తులు ముందుకు నడవాలని కోరారు. ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు చుండూరి రంగారావు మాట్లాడుతూ సాయిబాబాను తప్పుడు కేసులో ఇరికించి జైల్లో నిర్బంధించి చిత్రహింసలు

సాయిబాబా చిత్రపటానికి నివాళుల్పస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పెట్టారని తెలిపారు. తల్లి మరణిస్తే చూడడానికి కూడా నిరాకరించడం బిజెపి ప్రభుత్వ ఫాసిస్ట్ చర్యకు నిదర్శనమన్నారు. అన్ని వర్గాల ప్రజలు ప్రజా సంఘాలు ప్రజాస్వామిక వాదులు అందరూ మోడీ ప్రభుత్వం ఫాసిస్ట్ విధానాలను తిప్పి కొట్టడమే ఆయనకు ఘనమైన నివాళి అని తెలిపారు. ప్రజా కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు కోటి మాట్లాడుతూ ప్రొఫెసర్ సాయిబాబా పీడిత ప్రజల ఉద్యమాలకు బాసటగా నిలబడ్డారన్నారు. సమ సమాజం కోసం అలుపెరగని పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి ఎం. జార్జి, ఐఎల్‌పి రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం, ప్రజా రచయిత పి. శ్రీనివాస్, ప్రజాస్వామిక వాదులు ఆవుల సుబ్రహ్మణ్యం, పోరాట సమితి నాయకులు అంకయ్య, నరసింహారావు, సుబ్బారావు, యాదవ సంఘం నాయకులు అప్పారావు, రెడ్ స్టార్ నాయకులు రాజేంద్ర పాల్గొన్నారు.

సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సంతాపం

మానవ హక్కుల కార్యకర్త, మేధావి, ప్రొఫెసర్ సాయిబాబా మృతికి సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు సంతాపం తెలియజేశారు. సాయిబాబా జైల్లో అనేక రకాలైన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రభుత్వంపై అలుపెరగని పోరాటం చేశారన్నారు. సాయిబాబా ఆదివాసి ప్రజల పక్షపాతి. పీడిత ప్రజల గొంతుక అని కొనియాడారు. సాయి బాబా ప్రదర్శించిన పట్టుదల పోరాట పటిమ అంకితభావం నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సాయిబాబా కలలు కన్న సమసమాజం కోసం పోరాడాలని కోరారు.

ఎక్సైజ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

మద్యం దుకాణాల లాటరీకి ఏర్పాట్లు

- జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజా మొహిద్దీన్
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మద్యం దుకాణాల ఏర్పాటుకు అనుమతులు మంజూరునకు లాటరీ ప్రక్రియను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజా మొహియుద్దీన్ తెలిపారు. జిల్లాలో 171 దుకాణాలకు మొత్తం 3,466 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. స్థానిక అంబేద్కర్ భవనంలో సోమవారం పారదర్శకంగా లాటరీ ప్రక్రియను నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం రెండు కౌంటర్లను ఏర్పాటు చేస్తు న్నామన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఒకటి, సంయుక్త కలెక్టర్ ఆధ్వర్యంలో మరొక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు దారులందరూ ఉదయం 7.30 గంటలకు చేరుకోవాలన్నారు. ఉదయం 8 గంటలకు మొదటి డ్రా తీస్తామని స్పష్టం చేశారు.కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదివారం అంబేద్కర్ భవనాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఎల్ఇడి స్క్రీన్లు, సౌండ్ సిస్టం, వర్షం పడినా ఇబ్బంది లేకుండా ప్రాంగణంలో వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు, అర్జీదారులకు అవసరమైన సదుపాయాలు, జన సమూహాన్ని కట్టడి చేయటానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కె.హేమంత్ నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ, ఒంగోలు ఆర్‌డిఒ కె.లక్ష్మీ ప్రసన్న, ఎఇఎస్‌లు డి.బాలయ్య, వై.వెంకట్, ఏ.జనార్దన్‌రావు, ఎక్సైజ్ సిఐలు,ఎస్ఐలు ఉన్నారు.

సూక్ష్మపోషక ఎరువులపై రాయితీకి మంగళం..!

ప్రజాశక్తి- యర్రగొండపాలెం

భూమిలో సూక్ష్మపోషకాల లోపం ఏర్పడితే పంట దిగుబడిపై ప్రభావం చూపుతుంది. భూసార పరీక్షల ఆధారంగా లోపాలను గుర్తించి, నివారణకు తగిన సూక్ష్మపోషకాలను వినియోగిస్తే ఎరువుల వినియోగం, పెట్టు బడి తగ్గుతుంది. సారం లోపించిన భూములకు జింకు, బోరాన్, జిప్సమ్ లాంటి సూక్ష్మపోషకాలు అవసరం. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు సూక్ష్మపోషకాలను 50 శాతం రాయితీపై సరఫరా చేసేవారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన మొదట్లోనే వీటిపై రాయితీ పూర్తిగా నిలిపి వేసింది. దీంతో రైతులు ప్రైవేటు డీలర్ల వద్ద కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీనివల్ల అదనపు భారం పడుతోందని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో ఖరీఫ్ సాగు వివరాలు

కంది సాధారణ సాగు 73,003 హెకార్లు కాగా 17,441.5 హెక్టార్లలో రైతులు సాగు చేశారు. సాగు శాతం 24. పత్తి సాధారణ సాగు 31,562 హెక్టార్లు కాగా 8,387.59 హెక్టార్లతో సాగు చేశారు. సాగు శాతం 27. మిర్చి సాధారణ సాగు 23,873 హెక్టార్లు గానూ 767.65 హెక్టార్లలో సాగు చేశారు. సాగు శాతం 3.22. వరి సాధారణ సాగు 14,078 హెక్టార్లు కాగా 1,007.80 హెక్టార్లలో సాగు చేశారు. సాగు శాతం 7. సజ్జ సాధారణ సాగు 7,125 హెక్టార్లు కాగా 4,046 హెక్టార్లలో సాగు చేశారు. సాగు శాతం 57. నువ్వులు సాధారణ సాగు 2,790 హెక్టార్లు కాగా 2,828.70 హెక్టార్ల సాగు చేశారు. సాగు శాతం 101. మొక్కజొన్న సాధారణ సాగు 2,464 హెక్టార్లు కాగా 1,985.42 హెక్టార్లలో సాగు చేశారు. సాగు శాతం 81. మినుము సాధారణ సాగు 2,520 హెక్టార్లు కాగా కేలవం



250 హెక్టార్లల్లో రైతులు సాగు చేశారు. సాగు 10 శాతం మాత్రమే.

ఐదేళ్లుగా నిలిచిన సరఫరా..

గత టిడిపి ప్రభుత్వం హయాంలో జింకు సల్ఫేటు 10 కిలోల ధర రూ. 380 కాగా రాయితీపై రూ.180లకు రైతులకు అందించేవారు. చివరి రెండేళ్లలోను నూరు శాతం రాయితీపై కూడా పంపిణీ చేశారు. అధికారులు అప్పటికే భూసార పరీక్షలు పూర్తి చేసి జింకు లోపాన్ని గుర్తించే వారు. దమ్ము సమయంలో ఎంత పరిమాణంలో జింకు వేయాలో రైతులకు సూచించేవారు. అయితే వైసిపి అధికారంలోకి వచ్చిన ఐదేళ్ల నుంచి భూసార పరీక్షలను నిలిపివేశారు. ఈ ఏడాది ఆలస్యంగా భూసార పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం వరినాట్లు పూర్తి కావస్తున్నా వాటి ఫలితాలు వెల్లడి కాని పరిస్థితి. సాధారణంగా కొన్ని భూముల్లో జింకు ధాతు లోపంఉంటుంది. అందుకే దమ్ములో వేసుకోవాల్సి సూక్షపోక్షకాలు వేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం రాయితీపై ఇవ్వకపోవడంతో రైతు 20 కిలోల జింకు సంచిని రూ.550 నుంచి రూ. 650 కొనుగోలు చేయాల్సి వస్తోంది. దమ్ములో ముడి జింకు వేయని రైతులు ప్రస్తుతం పిచికారీ చేసే చిలేటెడ్ జింకును రూ.450 నుంచి రూ. 600 కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. ఇది ఒక పంటకు మాత్రమే పనికి వస్తుంది.దమ్ములో చల్లుకొనే జింకు అయితే మూడేళ్లపాటు పనిచేస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

దిగుబడిపై ప్రభావం...

వరి పంటలో జింకు లోపం ఏర్పడితే ఆకుల మధ్య భాగం పసుపురంగులో మారి మొక్క గిడసబారి పోతుంది. దీంతో ఎకరాకు మూడు నుంచి నాలుగు బస్తాల వరకూ దిగుబడి తగిపోతుంది. బోరాన్ పూత దశలో కీలకంగా పని చేస్తుంది. ఆకుల్లో తయారయ్యే ఆహారాన్ని అది అన్ని భాగాలకు చేరుస్తుంది. ఇనుపధాతు లోపం ఏర్పడితే వరిలో ఆకులు ఎర్ర బారిపోతాయి. పంటకు సాధారణ ఎరువులు ఎంత అవసరమో సూక్ష్మపోషకాలు కూడా అంతే అవసరం.

రాయితీపై సూక్ష్మపోషకాలు అందించాలి

బాశం లక్ష్మిరెడ్డి, రైతు, మురారిపల్లి

ఇక్కడి భూముల్లో జింకు ధాతు లోపం ఎక్కువగా ఉంటుంది. దీంతో పంటల దిగుబడి ఆశించిన స్థాయిలో రావడం లేదు. జింకు ధాతు లోపం నివారించడానికి సూక్ష్మపోషకాలు ఎంతో అవసరం. బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాలంటే భారంగా మారుతోంది. ప్రభుత్వమే రాయితీపై సూక్ష్మపోషకాలను అందించాలి.

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

దుగ్గె పరంజ్యోతి, రైతు, గంగుపల్లి

ప్రభుత్వం సూక్ష్మపోషకాలపై రాయితీ నిలిపివేసింది. గత ఐదేళ్లుగా ఇవ్వడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతన ప్రభుత్వం సూక్ష్మపోషకాల పంపిణీపై ఓ నిర్ణయం తీసుకోవాలి. రాయితీపై అందించి రైతులను ఆదుకోవాలి.

రైతులకు అవగాహన కల్పించాలి

దేశావత్ వెంకటేశ్వర్లు నాయక్, రైతు, పిల్లికుంట తాండా

గతంలో ప్రభుత్వం రాయితీపై సూక్ష్మపోషకాలను పంపిణీ చేసేంది. ప్రస్తుతం నిలిపివేసింది. దీనికి తోడు సూక్ష్మపోషకాల లోపంపై వ్యవసాయ శాఖ ధికారులు అవగాహన కల్పించడంలోనూ వెనుకబడుతున్నారు. ఫలితంగా రైతాంగం తీవ్రంగా నష్టపోతుంది. సూక్ష్మపోషకాలపై రైతులకు అవగాహన కల్పించారు.